ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -198 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 14 మే 2025

# ఖజానా పెరగాలి

: అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

రాష్ట్ర ఆదాయానికి సీఎం చంద్రబాబు వ్యూహం

లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు స్పష్టీకరణ

పన్ను ఎగవేతలకు టెక్నాలజీతో చెక్!

ఎర్రచందనం విక్రయంపై ప్రత్యేక కమిటీ



**అమరావతి,, మే 13 ఆంధ్ర ప్రగతి:** రాష్ట్ర ఆర్థిక వనరులను గణనీయంగా పెంచేందుకు పటిష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేడు సచివాలయంలో ఆదాయార్జన శాఖలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, గత మూడు దశాబ్దాల ఆదాయ సరళిని లోతుగా అధ్యయనం చేసి, భవిష్యత్తుకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 1,34,208 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించినట్లు సీఎం తెలిపారు.

మిగతా 2లో

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

శివాపురం వద్ద బొప్పాయి లోడ్ బొలెరోను ఢీకొన్న లారీ

నలుగురి దుర్మరణం గాయపడిన మరికొందరు

మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి.. అండగా ఉంటానని హామీ

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



పల్నాడు **మే 13 ఆంధ్ర ప్రగతి:** జిల్లాలో ఈ ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. బొలెరో వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఈ దారుణం జరిగింది. వినుకొండ మండలం శివాపురం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

మిగతా 2లో



6లో

## చార్మినార్ వద్ద సుందరీమణుల సందడి

గ్రూప్ ఫోటోలు దిగిన అందాల అతివలు

లాడ్ బజార్‌లో షాపింగ్ చేసిన ముద్దుగుమ్మలు

## విద్యా సంస్థల్లో నాన్ లోకల్ కోటాకు చెల్లు

ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం ..

స్థానికేతర కోటా ఇక పూర్తిగా మనవాళ్లకే




**అమరావతి,, మే 13 ఆంధ్ర ప్రగతి:** ఇప్పటికే 15 శాతం కోటాలో ఏపీ వారికి అవకాశం లేకుండా ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ సర్కార్‌తాజాగా ఇక్కడి వర్శిటీల్లో తెలంగాణ వారికి అవకాశం లేకుండా ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వంవృత్తి విద్య, డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు ఇప్పటివరకు అమలవుతున్న 15 శాతం స్థానికేతర

మిగతా 2లో

## ఏపీ మద్యం కుంభకోణం నిందితుడు బాలాజీ అరెస్ట్



**అమరావతి,, మే 13 ఆంధ్ర ప్రగతి:** ఏపీ మద్యం కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు నిందితులలో ఒకరైన గోవిందప్ప బాలాజీని సిట్ అధికారులు అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో మైసూరులో బాలాజీని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మైసూరు నుంచి ట్రాన్సిట్ వారెంట్ తో బాలాజీని విజయవాడకు తరలిస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం. భారతి సిమెంట్స్ కంపెనీలో గోవిందప్ప బాలాజీ డైరెక్టర్ గా కొనసాగుతున్నారు. కాగా, బాలాజీ అరెస్టుతో మద్యం కుంభకోణం కేసులో ఇప్పటి వరకు అరెస్టైన వారి సంఖ్య ఐదుకు చేరింది.

## పరిశ్రమలకు రెడ్ కార్పెట్...



రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి: మంత్రి నారా లోకేశ్

ప్రతి సంస్థకు ఒక నోడల్ అధికారి

నారా లోకేశ్ వినూత్న నిర్ణయం

వచ్చే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు

**అమరావతి,,మే 13 ఆంధ్ర ప్రగతి:** రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు ఏపీ ప్రభుత్వం నడుం బిగించింది. నూతన పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్న సంస్థలకు సత్వర అనుమతులు, పూర్తిస్థాయి సహకారం అందించాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రూ. 91,839 కోట్ల పెట్టుబడితో, 1,41,407 ఉద్యోగాలను కల్పించేందుకు సుమారు 91 దిగ్గజ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు

మిగతా 2లో





## ధర్మ సంస్థాపన కోసం

# ఆయుధం పట్టాల్సిందే

### ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన మోడీ

- వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా
- ప్రపంచమంతా మార్మోగిన ఆపరేషన్ సిందూర్ నినాదం
- యుద్ధక్షేత్రంలో జై భారత్ మాతా నినాదాలు
- సైనికులకు సెల్యూట్ చేసి ముచ్చటించిన ప్రధాని

ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం.. మన సంప్రదాయం.. మన విధానమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మన సైన్యం చూపిన శక్తి సామర్థ్యాలు భావితరాలకు గొప్ప ప్రేరణ అని ఆయన అభివర్ణించారు. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ తాను సెల్యూట్ చేస్తున్నారన్నారు. వీర సైనికుల పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం.. ప్రపంచమంతా మార్మోగు తోందని తెలిపారు.

మిగతా 2లో

## మురళీ నాయక్ త్యాగానికి దేశం రుణపడి ఉంటుంది

వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్

వైసీపీ తరపున వీర జవాన్ కుటుంబానికి రూ. 25లక్షలు ఇస్తానని వెల్లడి

మురళీ నాయక్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందన్న వైసీపీ అధినేత



**శ్రీసత్యసాయి, మే 13 ఆంధ్ర ప్రగతి:** దాయాది పాకిస్థాన్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈరోజు ఉదయం బెంగళూరులోని నివాసం నుంచి రోడ్డు మార్గంలో ఆయన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చేరుకున్నారు.మురళీ నాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయిలను పరామర్శించి వారి దుఃఖాన్ని పంచుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

మిగతా 2లో

## ముగ్గురు ముష్కరులు హతం

జమ్మూకశ్మీర్ లో ముగిసిన ఎన్ కౌంటర్...

షోపియాన్ జిల్లాలో భీకర ఎన్‌కౌంటర్

ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతం

షుక్రు కెల్లర్ అటవీ ప్రాంతంలో పక్కా సమాచారంతో కార్డన్ సెర్చ్



2లో

# ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టాల్సిందే

**చండీఘడ్,మే 13 ఆంధ్ర ప్రగతి:** మంగళవారం పంజాబ్‌లోని అదంపూర్ ఎయిర్‌బేస్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా సైనికులతో ఆయన మాట్లాడారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ప్రసంగించారు. మన సైన్యం చేపట్టిన ఈ పరాక్రమం.. భారత్ సామర్థ్యానికి ప్రతి రూపమని పేర్కొన్నారు. భారత్ చూపిన ఈ పరాక్రమం.. త్రివిధ దళాల త్రివేణీ సంగమమన్నారు. పాకిస్థాన్‌కు భారత వాయుసేన తన సత్తా చాటిందంటూ ప్రశంసల జల్లు కురిపించారు. యుద్ధ క్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశామని.. ఈ జయ జయ ద్వానాలు ప్రపంచమంతా విన్నదని ఆయన గుర్తు చేశారు. భారత్ మాతాకీ జై అనేది ప్రతీ పౌరుడి నినాదమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అణు బాంబు హెచ్చరికలను సైతం చిత్తు చేశామని చెప్పారు. దేశంలోని ప్రతీ పౌరుడూ గర్వపడేలా మీరు చేశారంటూ సైనికులను ఈ సందర్భంగా ప్రధాని మోదీ అభినందించారు. మీరందరూ చరిత్ర సృష్టించారంటూ సైనికులను వెన్నుతట్టి ప్రోత్సహించారు. మీ కోసమే నేను ఇక్కడికి వచ్చానని చెప్పారు. వీరులను చూసినప్పుడు జీవితం ధన్యమవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.'భారత్ మాతాకీ జై' నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. అది శత్రువుల వెన్నులో వణుకు పుట్టించిందని వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలని మన సైన్యం శపథం చేసింది. మన సైన్యం చూపిన శక్తిసామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువే. అణు బ్లాక్‌మెయిల్‌ను అపహాస్యం చేసింది. భారత శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. యుద్ధక్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశాం. ఆకాశం నుంచి పాతాళం వరకు ఆ నినాదం మార్మోగింది. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా. ప్రతి భారతీయుడు



సైన్యానికి మద్దతుగా నిలబడ్డాడు. భారత సేనలకు కృతజ్ఞతలు చెప్తున్నాడు. ధర్మసంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం.. మన విధానం. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాని నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం అని ప్రధాని ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మన భద్రతా బలగాలు ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాయి. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్ మే 9, 10వ తేదీల్లో దాడులకు యత్నించింది. అయితే వాటిని మన సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. దాయాది టార్గెట్ చేయాలని యత్నించిన వాటిలో ఆదంపుర్ వైమానిక స్థావరం కూడా ఒకటి. ఈ ఉదయం నేను ఆదంపుర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను.

అక్కడ మన పోరాటయోధులను కలిశాను. ధైర్యం, దృఢ సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచేవారితో మాట్లాడటం ఒక ప్రత్యేక అనుభవం. మన దేశ రక్షణ కోసం బలగాలు చేసే ప్రతిచర్యకు ప్రజలందరూ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటారని ఎక్స్ వేదికగా మోదీ రాసుకొచ్చారు. అలాగే వారితో దిగిన చిత్రాలను షేర్ చేశారు. అక్కడికి వెళ్లి పాక్ చేసిన తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టారు. వాయుసేన సిబ్బందితో ముచ్చటించి భుజం తట్టారు. ఆపరేషన్ వివరాలను మోదీకి బలగాలు వివరించాయి. గంటన్నరకు పైగా ఆయన అక్కడే గడిపారు. ఆ సమయంలో ఆయన ధరించిన టోపీపై త్రిశూల్ చిత్రం కనిపించింది.

ఆపరేషన్ సిందూర్ గురించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మరుసటిరోజు మోదీ ఈ పర్యటన చేపట్టారు. నిన్న ప్రధాని మాట్లాడుతూ.. భారత్ ప్రళయభీకర దాడులను తట్టుకోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందని వెల్లడించిన సంగతి తెలిసిందే. నవయుగ యుద్ధంలో పాకిస్థాన్‌ను భారత్ మట్టి కరిపించిందని, వారు సరిహద్దుల్లో యుద్ధానికి దిగితే మనం వాళ్ల గుండె పైనే కొట్టగలిగామన్నారు. ఆ దేశ ప్రవర్తనను పరిశీలిస్తామని, మున్ముందు ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోబోమని హెచ్చరించారు. పహల్గాంలో ఉగ్రవాదులు వికృత క్రూరత్వాన్ని ప్రదర్శించి.. కుటుంబ సభ్యుల ముందే అమాయక ప్రజలను చంపినందుకు ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర సౌధాలను కుప్పకూల్చి 100 మందికి పైగా పేరుమోసిన ఉగ్రవాదులను అంతమొందించినట్లు- ప్రకటించారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే ఉగ్రవాద నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై మాత్రమేనని స్పష్టంచేశారు. భారతదేశాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి ఎంతపెద్ద నిర్ణయం తీసుకోడాని-కై-నా వెనుకాడబోమని పాక్‌కు తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ షేర్ చేసిన చిత్రాల్లో చెక్కు చెదరకుండా ఉన్న ఎస్-400 రక్షణ వ్యవస్థ కనిపించింది. ఆదంపుర్‌లోని ఎస్-400 స్థావరాన్ని ధ్వంసం చేశామని పాక్ ప్రచారం చేసింది. భారత్‌లోని కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్తు.. సైబర్ వ్యవస్థలపై దాడి చేసి ధ్వంసం చేశామని చెప్పింది. ఇదంతా హేయమైన దుష్ప్రచారం అని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఎయిర్‌బేస్‌కు వెళ్లి మోదీ దాయాది తప్పుడు ప్రచారానికి చెక్ పెట్టారు. అలాగే భద్రతాబలగాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఈ పర్యటన ద్వారా గట్టి సందేశం ఇచ్చారు.

# మన ఖజానా పెరగాలి

**(మొదటి పేజీ తరువాయి)**

పన్ను ఎగవేతలను సమర్థవంతంగా అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధను (ఏఐ) వినియోగించుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అన్ని శాఖల సమాచారంతో 'డేటా లేక్' ఏర్పాటు చేయాలని, ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీని ద్వారా పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ఎగవేతలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. బంగారం కొనుగోళ్లలో రాష్ట్రం ముందున్నప్పటికీ, పన్నుల రూపంలో ఆశించిన ఆదాయం రాకపోవడంపై దృష్టి సారించాలని సూచించారు.అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలకు, దాని విలువ నిర్ధారణకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వేల కోట్ల విలువైన ఎర్రచందనం రాష్ట్రానికి ఒక వరం లాంటిదని, దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఖజానాకు భారీ ఆదాయం సమకూర్చుకోవచ్చని అన్నారు. కమిటీ ద్వారా ఎర్రచందనం నిల్వలు, వాటి విలువపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాను కఠినంగా నియంత్రించాలని, మద్యం సరఫరా నుంచి అమ్మకాల వరకు పూర్తి పారదర్శకత ఉండేలా రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ ఆదాయం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉండటంపై దృష్టి సారించి, ఆదాయ మార్గాలను అన్వేషించాలని కోరారు. నూతన ఎక్సైజ్ విధానం సత్ఫలితాలనిస్తున్నా, మరింత మెరుగుపడాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మే 11 నాటికి కేంద్రం నుంచి రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇది గత ఏడాదితో పోలిస్తే 26 శాతం తక్కువని అధికారులు సీఎంకు వివరించారు. ఆదాయార్జన శాఖలన్నీ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి, రాష్ట్ర ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# పరిశ్రమలకు రెడ్ కార్పెట్...

**.(మొదటి పేజీ తరువాయి)**

ఆ కంపెనీలకు అవసరమైన చేయూత అందించడంపై ఇవాళ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఉండవల్లిలోని తన నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న ప్రతి పెద్ద కంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని స్పష్టం చేశారు. దీనివల్ల అనుమతుల ప్రక్రియ వేగవంతమై, సంస్థలు త్వరితగతిన కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలవుతుందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. విశాఖపట్నం నగరాన్ని అత్యాధునిక ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఐటీ కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.పౌరసేవలను మరింత సులభతరం చేసే దిశగా, 'మన మిత్ర' యాప్‌లో అందుబాటులో ఉన్న 317 సేవలను నెలాఖరు నాటికి 400కు పెంచాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ధృవపత్రాలకు బ్లాక్‌చెయిన్, క్యూఆర్ కోడ్ సాంకేతికత జోడించాలని, పన్నుల బకాయిల వివరాలను వాట్సాప్ ద్వారా తెలిపేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్‌లో డేటా పాయింట్లు, కేపీఐలను ఇంటిగ్రేట్ చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సమాచారాన్ని రియల్ టైమ్‌లో పొందుపరచాలన్నారు. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించే వ్యవస్థను పటిష్టం చేయాలని, విశాఖలో జూన్ 9, 10 తేదీల్లో జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కోరారు.

వివిధ ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఏకీకృతం చేసి, కృత్రిమ మేధ (ఏఐ) జోడించి ఒకే వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేవాలని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను సరళతరం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని జీవోలు, యాప్‌లను ఒకే వేదికపైకి తెచ్చి, ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్, ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవన సాగుతోనే రైతుకు అత్యధిక ఆదాయం

## హార్టికల్చర్ శాఖపై సమీక్ష చేపట్టిన సీఎం చంద్రబాబు



**అమరావతి,, మే 13 ఆంధ్ర ప్రగతి:** గోదావరి, కృష్ణా డెల్టా మినహా రాష్ట్రంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ హార్టికల్చర్ సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని... రైతుకు ఎకరాకు ఏడాదికి కనీసం లక్ష రూపాయలు ఆదాయం ఆర్జించడమే లక్ష్యం కావాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులతో అన్నారు. మంగళవారం నాడు సచివాలయంలో హార్టికల్చర్‌పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. మిరప, అరటి, మామిడి, ఆయిల్ పామ్, కోకో, డ్రాగన్ ఫ్రూట్, జీడిమామిడి, కాఫీ, కొబ్బరి, టొమాటో, ఉల్లి వంటి 11 ప్రాధాన్య పంటలతో రాష్ట్రంలో 24 క్లస్టర్లు ఏర్పాటు చేసి రైతులకు తోడ్పాటు అందించాలని చెప్పారు.

"ప్రస్తుతం రాష్ట్రంలో 18.23 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యానవన సాగును, వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయాలి. ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి పంటల డిమాండ్ దృష్ట్యా రైతులకు ఈ పంటల సాగు విషయంలో అవగాహన కల్పించాలి. ప్రపంచంలో కోకో సాగులో 1 శాతం కన్నా తక్కువగా మన దేశంలో సాగు అవుతోంది. ప్రపంచ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకునేలా లక్ష ఎకరాల్లో కోకో సాగు చేసేలా చూడాలి. కోకో పంట కోసిన తర్వాత నాణ్యత విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకునేలా శిక్షణ ఇవ్వాలి. అలాగే వీటికి అనుబంధంగా చిన్నతరహాలో ప్రాసెసింగ్ యూనిట్లు రైతులే నెలకొల్పేలా చేస్తే మరింత ఆదాయానికి అవకాశం ఉంటుంది. రైతులు పండించే పంటలకు అధిక విలువ తీసుకురావడంపై దృష్టి పెట్టాలి" అని సీఎం అన్నారు."మైక్రో ఇరిగేషన్‌కు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీని రాష్ట్రంలో రైతులు వినియోగించుకునేలా చూడాలి. ఎస్సీ, ఎస్టీ, చిన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే ఇప్పటికే రైతులు ఏర్పాటు చేసుకున్న డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమేషన్ పరికరాలు అమర్చాలి. దీని ద్వారా నీరు, ఎరువులు ఆదా అవుతాయనే విషయం రైతులకు తెలియజేయాలి" అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. మరోవైపు ఉద్యానవనరంగానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ ప్రతి నెలా అన్ని జిల్లాల్లో కాంక్లేవ్‌లు నిర్వహిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే 10 వేల హెక్టార్లలో పండ్ల సాగు చేస్తున్న రైతులకు రూ.32 కోట్ల వ్యయంతో ఫ్రూట్ కవర్లు సబ్సిడీపై అందించామని, దీంతో రైతులకు రూ.120 కోట్లు అదనంగా ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాలోఘోర రోడ్డు ప్రమాదం..

**(మొదటి పేజీ తరువాయి)**

బొప్పాయి కాయలతో వెళుతున్న బొలెరో వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచాడు.మృతులంతా ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. పనుల నిమిత్తం వీరు ప్రయాణిస్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గడ్డమీదపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి

పల్నాడు జిల్లాలో జరిగిన ఈ రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని, ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

## మురళీ నాయక్ త్యాగానికి

# దేశం రుణపడి ఉంటుంది

**(మొదటి పేజీ తరువాయి)**



మురళీ నాయక్ చేసిన త్యాగానికి దేశం రుణపడి ఉంటుందన్నారు. వైసీపీ తరపున వీర జవాన్ కుటుంబానికి రూ. 25లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. మురళీ నాయక్ కుటుంబానికి తమ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని జగన్ భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన తిరుగు పయనమయ్యారు. కాగా, జగన్ నివాళులు అర్పిస్తున్న సమయంలో మురళీ నాయక్ తండ్రి స్పందిస్తూ... "మురళీ... నీ కోసం జగనన్న వచ్చాడు... లేచి సార్ కి సెల్యూట్ కొట్టరా" అంటూ అనడం అక్కడున్న అందరినీ కదిలించింది. ఇక, ఇప్పటికే వీర జవాన్ కుటుంబానికి రూ. 50 లక్షల ఆర్థిక సాయం, ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, 300 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన వ్యక్తిగతంగా మురళీ నాయక్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఇస్తానని ప్రకటించారు.

# ముగ్గురు ముష్కరులు హతం

**మే 13 ఆంధ్ర ప్రగతి:** దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఈరోజు జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. సరిహద్దు అవతల ఉన్న ఉగ్రవాద శిబిరాలపై కఠిన చర్యలు తీసుకున్న భద్రతా దళాలు, ఇప్పుడు లోయలోపల కూడా ఉగ్రవాద నిర్మూలన చర్యలను తీవ్రతరం చేశాయి.

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, షోపియాన్ జిల్లా పరిధిలోని షుక్రు కెల్లర్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న పక్కా సమాచారం భద్రతా దళాలకు అందింది. దీంతో అప్రమత్తమైన సైనిక బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. గాలింపు చర్యలు కొనసాగుతుండగా, ఓ చోట ఉన్న ఉగ్రవాదులు భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడ్డారు.దీంతో భద్రతా దళాలు తక్షణమే ప్రతిస్పందించి, ఎదురుకాల్పులు జరిపాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య భీకరమైన కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు మరణించినట్లు అధికారులు ధృవీకరించారు. హతమైన ఉగ్రవాదుల నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆపరేషన్ జరిగిన ప్రాంతంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు తెలిపారు. కశ్మీర్ లోయలో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టే దిశగా భద్రతా దళాలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని వారు స్పష్టం చేశారు.

# విద్యా సంస్థల్లో నాన్ లోకల్ కోటాకు చెల్లు

## ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం ..

## రాష్ట్రంలోని స్థానికేతర కోటా ఇక పూర్తిగా మనవాళ్లకే

**(మొదటి పేజీ తరువాయి)** (నాన్ లోకల్), జనరల్ కోటా సీట్ల విషయంలో ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు నాన్ లోకల్ కోటా కింద 15 శాతం సీట్లలో తెలంగాణకు చెందిన వారికి అవకాశం కల్పిస్తుండగా, ఇక నుంచి పూర్తిగా ఏపీ వారికే కేటాయించనున్నారు.

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలు, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిబంధనల్లో స్థానిక, స్థానికేతరులను స్పష్టం చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం వేర్వేరుగా మూడు ఉత్తర్వులు జారీ చేశారు.ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం అక్కడి వర్సిటీల్లోని 15 శాతం కోటాలో ఏపీ వారికి అవకాశం లేకుండా ఉత్తర్వులు జారీ చేయగా, ఇప్పుడు ఏపీ ప్రభుత్వం సైతం ఇక్కడి వర్సిటీల్లో తెలంగాణ వారికి అవకాశం లేకుండా ఉత్తర్వులు ఇచ్చింది. కన్వీనర్ కోటా సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయిస్తారు.స్థానికత ఏపీలో రెండు రీజియన్లుగా ఉంటుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రీజియన్లుగా దీన్ని నిర్ణయిస్తారు. ఉమ్మడి ఏపీ, విభజన అనంతరం పదేళ్లపాటు ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా రీజియన్లుగా సీట్ల భర్తీ చేయగా, ఇప్పుడు ఉస్మానియా రీజియన్?ను తొలగించారు. ఇక నుంచి ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర రీజియన్ల వారీగా మాత్రమే సీట్లను భర్తీ చేయనున్నారు.

# ఎపి చీఫ్ జస్టిస్‌తో సిఎం చంద్రబాబు భేటీ

## మర్యాదపూర్వక భేటీయేనన్న సిఎంవో



**అమరావతి,,మే 13 ఆంధ్ర ప్రగతి:**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో సీఎం చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. మంగళవారం విజయవాడలోని చీఫ్ జస్టిస్ నివాసంలో ఆయనతో సీఎం చంద్రబాబు భేటీ- అయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ భేటీ సాగింది. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చినట్లు- తెలుస్తోంది. ముఖ్యంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుతోపాటు- ఇటీవల రాజధాని అమరావతిలో నిర్మాణాలకు సంబంధించి.. అందులో హైకోర్టు నిర్మాణ సముదాయం, జడ్జిల క్వార్టర్స్ నిర్మాణంతోపాటు- చీఫ్ జస్టిస్ నివాసానికి సంబంధించిన డిజైన్లను హైకోర్టు చీఫ్ జస్టిస్ ఠాకూర్‌కు సీఎం చంద్రబాబు వివరించారని సమాచారం. అయితే ఈ భేటీ-లో చర్చించిన అంశాలను ఉన్నతాధికారులు ఎవరూ ధృవీకరించ లేదు. అయితే ఇది మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసింది. మరోవైపు హైకోర్టుకు సైతం మే 12వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. దాదాపు నెల రోజులపాటు- సెలవులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అమరావతి నిర్మాణానికి సంబంధించి హైకోర్టుతోపాటు- అసెంబ్లీ, వివిధ భవనాల నిర్మాణాలకు -టె-ండర్లు పిలిచారు. ఆ -టె-ండర్లు సైతం ఇప్పటికే ఫైనల్ అయ్యాయి. మరోవైపు ఆ భవన నిర్మాణాల ఆకృతులకు సంబంధించిన -టె-ండర్లూ పూర్తయ్యాయి. వీటన్నింటిని పరిశీలించి సలహాలు సూచనలు తీసుకునేందుకే హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను సీఎం చంద్రబాబు కలిసి ఉంటారనే ఒక చర్చ ప్రధానంగా నడుస్తోంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 14 మే 2025

## ముచ్చుమర్రిలో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణి.



**ఆంధ్ర ప్రగతి ముచ్చుమరి మే 13:** నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమరి గ్రామంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు టిడిపి మెంబర్షిప్ కార్డులను పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముచ్చుమర్రి గ్రామ పెద్దలు వెంకట్రామిరెడ్డి, విద్యార్థి సంఘ నాయకుడు కుమ్మరి నాగరాజు, టిడిపి నాయకులు రాజు, బసవగౌడ్, బొల్లవరం స్వాములు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ - బజరంగ్ దళ్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 13:**
విశ్వహిందూ పరిషత్ మరియు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈరోజు, మంగళవారం, జి. పుల్లారెడ్డి భవన్, విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో (టెక్కె భరతమాత గుడి ప్రక్కన ) విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ప్రేరణ దాయకంగా జరిగింది. ఈ సమావేశంలో ఈ నెల 22 వ తేదీ జరుప తలపెట్టిన వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో చేపట్టవలసిన కార్యక్రమాల గురించి కూలంకషంగా చర్చించారు. దేశమంతటా ఈ శోభాయాత్ర యొక్క ప్రాముఖ్యతను, దానిని విజయవంతం చేయాల్సిన అవసరాన్ని పెద్దలు కార్యకర్తలకు తెలియజేశారు. శోభాయాత్రకు సంబంధించిన గోడ పత్రికలు, బ్యానర్లు మరియు స్టిక్కర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.సదరు కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ దక్షిణ ఆంధ్ర ఉపాధ్యక్షుడు శ్రీ ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా సంఘచాలక్ శ్రీ చిలుకూరి శ్రీనివాస్, విభాగ సహ కార్యవాహశ్రీ రామాంజనేయులు, జిల్లా కార్యవాహ శ్రీ అల్లం రఘురాములు, శోభాయాత్ర ప్రముఖ్ శ్రీ నాగరాజు, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ రాంప్రసాద్, మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## నంద్యాలలో ఫిట్టర్లు మరో కొత్త రకం

# దోపిడీ చేస్తున్నారా.!

### నూతన పైపులైన్...ఫిట్టర్ కు కలిసివచ్చిందా.

- -పైపులైన్ ఏర్పాటు శాపంగా మారిందన్న భాదితులు.
- -కమర్షియల్ కనెక్షన్స్ కు డొమెస్టిక్ ఇచ్చిన ఫిట్టర్లు,అధికారులపై చర్యలు నిల్.
- -అధికారులు గుర్తించి నవి 230.
- -వెలుగులోకి రానివి ఎన్నో.
- -మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి కొట్టిన అధికారులు ,ఫిట్టర్లు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 13:**
నంద్యాల మున్సిపల్ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారింది.మున్సిపల్ కార్యాలయం అవినీతి రోజు,రోజుకు పెరిగిపోతుంది.ప్రభుత్వం,రాజకీయ నాయకులు చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు,సిబ్బంది విచ్చలవిడిగా దోచుకుంటూ ప్రభుత్వానికి భారీ గండి పెడుతున్నారు.తాజాగా ఒక ఫిట్టర్ కొత్త రకం దోపిడీకి తెరలేపారు.వార్డులో నూతన పైపు లైన్ ఏర్పాటు ఆ ఫిట్టర్ కు అదృష్టం కలిసి వచ్చింది.తమ వార్డులో మంచినీటికి ఇబ్బంది లేకుండా కొత్త పైపు లైన్ ఏర్పాటు చేయడం సంతోషించాలో,వేదం వల్ల తమ మంచినీటి కొళాయి కనెక్షన్ కట్ కావడం బాధపడాలో అర్థం కాని పరిస్తితి ఆ వార్డ్ ప్రజలది.నంద్యాల మున్సిపాలిటీలో ఫిట్టర్ ల దోపిడి అంతా ఇంతా కాదు.గత పదేళ్లలో అధికారులు,ఫిట్టర్ ల దోపిడి తెలుసుకుంటే కళ్ళు బైర్లు కమ్మాల్సిందే.తాజాగా ఫిట్టర్ దోపిడి తెలుసుకుందాం.వివరాల్లోకి వెళితే హరిజన వాడ ప్రాంతంలో నూతన పైపు లైన్లు వేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే పైపు లైన్ లు ఏర్పాటుచేసే సమయంలో గతంలో ఉన్న మంచినీటి కొళాయి ల కనెక్షన్ లు కట్ అవుతున్నాయి.ప్రభుత్వ నిబంధనల మేరకు కట్ అయిన వాటికి ఎలాంటి డబ్బు తీసుకోకుండా చేయాల్సిన బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్,అధికారులు తీసుకోవాల్సింది.అలాంటిది ఏమి లేకపోవడంతో కట్ చేసిన కొళాయి కనెక్షన్స్ కావాలంటే ఆ ప్రాంత ఫిట్టర్ కు 5 నుంచి 6 వేలు ఇస్తేనే కనెక్షన్ ఇస్తున్నారని భాదితులు పేర్కొంటున్నారు.గతంలో కూడా ఆ ఫిట్టర్ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ సతీమణి నాగిని రెడ్డి వార్డులో సైతం ఇలాగే చేయడంతో శిల్పా దృష్టికి భాదితులు తీసుకొని పోవడంతో ఆ ఫిట్టర్ ను మందలించిన విషయాన్ని కె.ఎస్.కె.న్యూస్ అప్పట్లో తెలియజేసిన విషయం విదితమే.ప్రస్తుతం జరుగుతున్న దోపిడి నీ అధికారులు,నేతల దృష్టికి తీసుకొని వెళ్లాలని కొందరు సలహా ఇచ్చారు.నాయకులకు చెప్పినా,అధికారులకు చెప్పినా ఫలితం లేదని వాపోతున్నారు.గతంలో ఎమ్మెల్యే శిల్పా రవి అందుబాటులో లేకపోతే అక్కడ ఉన్న కొందరు ద్వితీయ స్థాయి నాయకులకు చెప్పినా ఫలితం ఉండేదని చెప్పడం విశేషం.కూటమి ప్రభుత్వంలో నాయకులు,అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.గతంలో అధికారులు,ఫిట్టర్లు చేసిన దోపిడి తెలుసుకోండి.ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి కొళాయి కనెక్షన్ కు దాదాపు 15 వేలు ఖర్చు అవుతుంది.కమర్షియల్ కనెక్షన్ లు అంటే ఆసుపత్రులు,అపార్ట్మెంట్స్,కళాశాలలు,హాస్టల్స్,వ్యాపార సముదాయాలకు డిపాజిట్ తో పాటు మీటర్ బిగించి వాడుకున్న నీటిని రీడింగ్ ద్వారా డబ్బు చెల్లించాల్సి వస్తుంది.అధికారులు,ఫిట్టర్లు మనము చెప్పిందే వేదం అని తలచి ఇష్టారాజ్యంగా కమర్షియల్ కనెక్షన్ లు ఇవ్వకుండా వారికి డొమెస్టిక్ కనెక్షన్ లు ఇచ్చి భారీగా డబ్బులు జోభిలో వేసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టారు.వారు ఇచ్చిన వ్యాపార సంస్థలు వేలకు,వేలు నీళు వాడుకొని కేవలం నెలకు 80 రూపాయలు మాత్రమే చెల్లిస్తూ ప్రతి నెల వారి వద్ద ఫిట్టర్లు అంతో కొంత తీసుకునేవారని తెలిసింది.ఇటీవల అధికారులు స్పెషల్ డ్రైవ్ పెట్టడం,పన్నుల వసూళ్ల 5 వ స్థానం నుంచి 98 స్థానం కు పడిపోయిన విషయం విదితమే.ఈ నేపథ్యంలో అధికారుల దాడుల్లో కళ్ళు బైర్లు కమ్మే విషయాలు బయటపడ్డాయి.కమర్షియల్ వ్యాపారులకు డొమెస్టిక్ కనెక్షన్ లు ఇచ్చినట్టు గుర్తించారు.అధికంగా పేరున్న ఆసుపత్రులు,అపార్ట్మెంట్స్,హాస్టల్స్ కు ఇచ్చినట్టు గుర్తించి ప్రస్తుతం 228 కనెక్షన్ లు తొలగించారు.గుర్తించనివి ఎన్ని ఉన్నాయో ఆ దేవుడికి,అప్పట్లో పని చేసిన అధికారులకు ,అప్పుడు,ఇప్పుడు పనిచేస్తున్న ఫిట్టర్లకే తెలియాలి. అధికారులను దోపిడి వివరాలు బహిర్గతం చేయాలని మీడియా అడిగినా సమాచారం ఇవ్వరు అంతా గోప్యం.నంద్యాలలో నేతలు ఉన్నా లేనట్లే అనిపిస్తుంది.అధికారులు మాత్రం దాచుకో,దోచుకో అన్న చందంగా మారింది.కూటమి ప్రభుత్వం వచ్చి న 11 నెలల్లో తెచ్చుకున్న చెడ్డపేరు అంతా ఇంతా కాదు.కూటమి ప్రభుత్వం కంటే వైసిపి ప్రభుత్వమే మేలు అని ప్రజలు చెప్పుకోవడం విశేషం.

## వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు.

**-2 లక్షల ఎకరాల భూములు సాగులోకి తెచ్చేందుకు రైతులను ప్రోత్సహించండి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 13:**
డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో వ్యవసాయంలో కిసాన్ డ్రోన్స్ వినియోగంపై గ్రూప్ కన్వీనర్, కో-కన్వీనర్, అధికారులు, ఎఫ్పిఓలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఎల్డిఎం రవీందర్ కుమార్, ఆర్ఆర్ఎస్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.రామకృష్ణా రావు, నాబార్డు డిడిఎం, డ్రోన్ నిర్వాహకులు చైతన్య, రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కిసాన్ డ్రోన్స్ సాంకేతికత వినియోగం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుక రావడంతో పాటు రైతులకు మెరుగైన ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రైతు గ్రూపులకు కూడా డ్రోన్స్ ఇవ్వడం జరిగిందని జిల్లాలో ఇప్పటి వరకు 40 డ్రోన్స్ వరకు వినియోగించడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ఇంకా అధునాత సాంకేతికత రావడం జరుగుతుందని వాటిని రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. డ్రోగో కృషి 3ప్రో అనే డ్రోన్ సుమారు 9.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని అందులో 80 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, ఈ డ్రోన్ లో ఆటోమేటిక్, మాన్యువల్ పద్ధతి ద్వారా వినియోగించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఆటోమేటిక్ విధానం ద్వారా రైతుల దగ్గర ఉన్న ఎఫ్ఎంబి కాపీలో ఉన్న రేఖాంశం, అక్షాంశల వివరాలను డ్రోన్ లో నమోదు చేస్తే మనిషి అవసరం లేకుండా పొలం మొత్తం స్ప్రే చేసే అవకాశం ఉంటుందని, అదే విధంగా మాన్యువల్ పద్ధతిలో రిమోట్ కంట్రోల్ ద్వారా పొలం గట్ట




మీద నిలబడి కూడా ఆపరేట్ చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ డ్రోన్ లో ఉన్న సెన్సార్ ద్వారా గట్టు ఎత్తుల పల్లలాలు, విద్యుత్ తీగలు గుర్తించి స్ప్రే చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో 5 సెట్ల పునర్వినియోగించే బ్యాటరీలు ఉంటాయని 1 సెట్టు బ్యాటరీ ద్వారా నాలుగు ఎకరాలు, మొత్తం 5 సెట్టు బ్యాటరీల ద్వారా 20 ఎకరాల వరకు స్ప్రే చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ బ్యాటరీలు రీచార్జ్ చేయడానికి 45 ని.ల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. నానో యూరియా వినియోగం ద్వారా పెట్టుబడి తగ్గి దిగుబడి పెరగడం వల్ల డ్రోన్స్ వినియోగం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పొలాల్లో మోతాదుకు మించి రసాయనాలు వాడటం ద్వారా మైక్రో న్యూట్రియెంట్స్ తగ్గి భూమి నిస్సారవంతం అవుతుందన్నారు. భూమిలో కార్బన్ కంటెంట్ 3% కంటే తక్కువగా ఉందని... భూమి సారాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పంటలకు అవసరం వున్నా, లేకున్నా తడి ఇవ్వడం ద్వారా సూక్ష్మ పోషకాలు తగ్గి పంట దిగుబడి తగ్గుతోందని... వీటి నివారణ కోసం డ్రోన్స్ సరైన పరిష్కారమన్నారు. జిల్లాలో సుమారుగు 2 లక్షల ఎకరాల వరకు ఒకే పంట వేసి పంట పొలాలను బీడు భూములుగా వుంచకుండా వాటిలో వ్యవసాయ, ఉద్యానవన పంటలైన నువ్వులు, బ్లాక్ గ్రామ్, సోయా, కొర్ర తదితర పంటలు వేసేలా రైతులను ప్రోత్సాహించాలన్నారు.డ్రోన్స్ కు పొలాల దగ్గర ఛార్జింగ్ పెట్టుకునే అవకాశంతో పాటు డ్రోన్స్ ట్యాంకు సామర్థ్యాన్ని పెంచేలా చూడాలని డ్రోగో నిర్వాహకులను కలెక్టర్ కోరారు. అదే విధంగా ఈ డ్రోన్ లో ఎటువంటి సాంకేతిక సాయం కోసం టోల్ ఫ్రీ నెం.9294892948 ను సంప్రదించాలన్నారు. నంద్యాల పట్టణం కోవెలకుంట్ల రోడ్ లో ఉన్న డ్రోన్ సర్వీసు సెంటర్ షాపు నెం.14,15 ఆర్.ఆర్.ఆర్. రెస్టారెంట్ దగ్గర, రైతునగర్ లో వున్న సర్వీస్ సెంటర్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతకుముందు జిల్లా వ్యవసాయ అధికారి, నాబార్డు డిడిఎం, ఎల్డిఎం, డ్రోన్ సంస్థ నిర్వాహకులు కిసాన్ డ్రోన్స్ సాంకేతిక వినియోగం, ఉపయోగాలు, బ్యాంకు రుణం తదితర అంశాలపై వ్యవసాయ అధికారులు, రైతులకు అవగాహన కల్పించారు.

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఘనంగా సన్మానించిన మస్జిద్ ఏ ఫతః నూతన కమిటీ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 13:** నాగులగుంట రోడ్డు ముల్లాన్ పేట నందుగల మస్జిద్ ఏ ఫతః పునర్నిర్మాణం మరియు నూతన కమిటీ ఏర్పాటుకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ మసీద్ కమిటీ ఏర్పాటు ద్వారా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు . తెలుగుదేశం పార్టీ మైనారిటీలకు పెద్దపీట వేసిందని, ఏ సమస్య ఉన్నా తమకు వచ్చి విన్నవించాలని అన్నారు ఈ కార్యక్రమంలో మస్జిద్ ఏ ఫతః కమిటీ సభ్యులు మరియు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సీబీ ఎస్ ఈ 10 ఫలితాల్లో ఎస్.డి.ఆర్ విద్యార్థులు ప్రభంజనం




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 13:** సిబిఎస్ఈ మంగళవారం వెల్లడించిన 10వ తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యద్భుతమైన ఫలితాలను సొంతం చేసుకున్నట్టు ఎస్ డి ఆర్ వరల్డ్ స్కూల్ విద్యాసంస్థల అధినేత కొండారెడ్డి తెలిపారు. ఈఫలితాలలో తమ విద్యార్థిని చరణ శ్రీ 489/500 మార్కులతో స్కూల్ టాపర్ గా నిలిచినట్టు కొండారెడ్డి తెలిపారు. వీరితో పాటు తమ విద్యార్థులు ఇతర చంద్రకళ 481/500, కీర్తన 477/500, అనయ 472/500, నార్జార్జున 471/500, కె.అమూల్య 463/500, ఘనా శ్యామ్ 463/500, మనోజ్ 462/500, కార్తికేయ 458/500, పవన్‌కుమార్ రెడ్డి 454/500, సుశంత్ రెడ్డి451/500, భారత్ 450/500,నాగార్జున రెడ్డి 449/500 వెంకట సాయి రోహిత్ 448/500, శ్రీనాథ్ రెడ్డి 440/500 కుమార్ రెడ్డి 448/500, భువనేశ్వర్ రెడ్డి 448/500, లహిత్య 447/500, కెవిన్ 447/500, గురు అలేక్య 446/500 టి.పి.ధర్మ తేజ 446/500 మార్కులు సాధించారు అని కొండారెడ్డి తెలిపారు. సబ్జెక్టుల వారిగా గణితంలో 6 మంది విద్యార్థులు, సైన్స్ లో 6 మంది విద్యార్థులు, సోషల్ సైన్స్ లో 3 విద్యార్థులు, తెలుగులో 7 మంది విద్యార్థులు. ఇంగ్లీష్ లో ఒకరు చొప్పున వందకు వంద మార్కులు సాధించారు అని కొండారెడ్డి తెలిపారు.మా విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిబద్ధత ఫలితంగా ఈ అద్భుత విజయాలు సొంతం చేసుకున్నట్టు ఎస్.డి.ఆర్ వరల్డ్ స్కూల్ విద్యాసంస్థల అధినేత కొండారెడ్డి చెప్పారు.

## బాబు హనీమూన్ పూర్తయ్యింది: గిడుగు

**న్యూఢిల్లీ,మే 13 ఆంధ్ర ప్రగతి::** సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. వాటిని అమలు చేయలేక డకౌట్ అయ్యారని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారన్నారు. చంద్రబాబు తీరు చూస్తే వాగ్దానాలు అమలు చేసే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి హనీమూన్ పీరియడ్ పూర్తయ్యిందని చమత్కరించారు. అమరావతి పేరుతో మళ్లీ భూసేకరణ చేయడానికి మేము వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో భూమి ఇచ్చిన రైతులకే ప్రభుత్వం ఆర్థికంగా న్యాయం చేయలేదన్నారు. అమరావతి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అమరావతికి 7 వేల ఎకరాలు సరిపోతుందని గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన.. పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ.



**ఆంధ్ర ప్రగతి ఎమ్మిగనూరు మే 13:** మృతి చెందిన అనాధ శవానికి నేడు పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ యు రాము ఎంకోబు శావల బుజ్జిబాబు జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎం.నిఖిల్ చక్రవర్తి జడ్పీటీసీ నందవరం పూలే అంబేడ్కర్ ఆశ్రమం వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న జిల్లా కార్యదర్శి పి పెద్దయ్య పోలీస్ లు కే పరమేష్ జయరాముడు చట్ట ప్రకారంగా అనాధ శవానికి మట్టి కార్యక్రమం పూర్తిచేసి పూలమాలలు వేశారు నిన్నటిదినం అనాధ మగమనిషి ఎమ్మిగనూరు పట్టణం కర్నూల్ రోడ్డు నందు బీసీ స్మశాన వాటిక దగ్గర గుర్తుతెలియని మగమనిషీ వయస్సు 35 సంవత్సరాల వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు అటుగా వెళుతున్న ప్రయాణికులు పట్టణ పోలీసులకు అందించిన సమాచారం మేరకు పోలీసులు కేసు ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమాచారం పంపించిన తెలియక పోగ నేడుశావల సత్యనందం జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చింపిరి చిన్న పోతప్ప పూలే అంబబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ నందవరం మండల అధ్యక్షుడు సాతర్ల సల్మాన్ ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు మల్లెపోగు అబ్రహం జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండలం ఇన్చార్జి మీసాల వినోద్ కుమార్ జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండలం నాయకులు తదితరులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి

**-కనీస వేతనం 26,000 ఎనిమిది గంటల పని విధానం కోసం.**

**-20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు ఉద్యోగులు పాల్గొనాలని కార్మిక సంఘాలు పిలుపు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 13:**
కార్మికులకు వ్యతిరేకమైన నాలుగు రెబల్ లేబర్ కోడ్స్ ను రద్దుచేసి కనీస వేతనం 26,000 ఎనిమిది గంటల పని విధానం ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటికన్నా ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ఐ ఎఫ్ టి యు నాయకులు చౌడప్ప కార్మికులకు ఉద్యోగులకు ఈనెల 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంగళవారము నంద్యాల జిల్లా కేంద్రంలో నిశాంతి భవనందు కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఏఐటియుసి నాయకులు ఓబులేసు సిఐటియు నాయకులు లక్ష్మణ్ ఐ ఎఫ్ టి యు నాయకులు చౌడప్ప అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఉద్దేశించి సుంకయ్య నాగరాజు చౌడప్పలు మాట్లాడుతూ.. దేశంలో అధికారంలోకి వచ్చి ఈ పది సంవత్సరాల కాలంలో నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని నేను పేద కుటుంబం నుంచి వచ్చాను ఉద్యోగులను కార్మికులను ఆదుకుంటానని మాయమాటలు చెప్పి కార్మికులకు వ్యతిరేకమైనటువంటి కార్పొరేట్ పెట్టుబడుదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొని వచ్చి కనీస వేతనం అడగకుండా సంఘం పెట్టుకోవడానికి వీలు లేకుండా ఎనిమిది గంటల పని విధానాన్ని తుంగలో తొక్కి రోజుకు 14 గంటలు పని చేసే చట్టాలు తీసుకొని రావడం కార్మిక ఉనికికే ప్రమాదమని కార్పొరేట్ సంస్థలకు పెట్టుబడిదారులకు అనుకూలంగా పాలన చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన కార్మిక శక్తిని చూపించాలని ఈ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు

కనీస వేతనం ఇవ్వకుండా ఆశా అంగన్వాడి మధ్యాహ్న భోజన పథకం స్కూల్ స్కావెంజర్స్ మెడికల్ మున్సిపల్ విద్యా రంగాల్లోన కార్మికులు హక్కులు లేకుండా విధులు నిర్వహిస్తున్నారని పెరిగిన ధరలు కు అనుగుణంగా వారికి వేతనాలు లేవని కనీస వేతనం ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని డిమాండ్ చేశారు. అసంఘటితరంగా కార్మికులైన ఆటో హమాలీ స్ట్రీట్ వండర్స్ భవన నిర్మాణ కార్మికులు వ్యవసాయ కార్మికులు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలి వేతన బోర్డు కమిటీలు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఆనే వెలిగించే చట్టాలను రద్దు చేయాలని కోరారు లేనిపక్షంలో 20 తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని కష్టపడి పని చేసే చెమటోడ్చిన కార్మికులందరూ కార్మిక ఉద్యోగ ద్రోహి నరేంద్ర మోడీ చంద్రబాబు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కదం తొక్కి కార్మికుల ఎర్రజెండా చెత్త చూపాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు భూమన శ్రీనివాసులు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు రాయుడు ఎస్ టి యు టీచర్ సంఘ నాయకులు మౌలాలి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివ రాముడు మస్తాన్ ప్రతాప్ మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుశీలమ్మ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వేదవతి లక్ష్మీదేవి అంగన్వాడి అసోసియేషన్ ఏఐటీయూసీ నాయకురాలు చంద్రకళ సిఐటియు అనుబంధ నాయకులు జిల్లా అధ్యక్షులు ఏసరత్నం సిఐటి జిల్లా కార్యదర్శి బాల వెంకట్ సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గౌస్ లక్ష్మణ్ ఎల్ఐసి ఇన్సూరెన్స్ నాయకులు సెక్యూరిటీ గార్డ్స్ తదితర కార్మిక సంఘాల అనుబంధం నాయకులు పాల్గొన్నారు.

## స్మశాన భూమి ఆక్రమణదారుల పై చర్యలు తీసుకోవాలి.

**-ముసలమడుగు గ్రామంలో ఎస్.సి మాల కమ్యూనిటీ కొరకు స్మశానం భూమి 5 ఎకరాల కేటాయింపు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 13:**నంద్యాల జిల్లా, కొత్తపల్లి మండలం, ముసలమడుగు గ్రామంలో ఎస్.సి కమ్యూనిటీ కొరకు కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో రెండు ఎకరాలు తెలుగు పెద్ద కురుమన్న, తెలుగు చిన్న కురుమన్న లకు అడ్డదారిలో భూమి కేటాయించబోతున్న అంశంలో కొత్తపల్లి తహసీల్దార్, ఆర్డీఓ ఆత్మకూరు లపై చర్యలు తీసుకోవాలని మంగళవారం నాడు నంద్యాల కలెక్టర్ మరియు డీఆర్ఓ లకు లిఖితపూర్వకంగా పిర్యాదు చేసినట్లు జాతీయ మాల మహానాడు జాతీయ కార్యదర్శి సొగరాజు మునెయ్య తెలిపారు. సోగరాజు మునెయ్య మాట్లాడుతూ కొత్తపల్లి తహసీల్దార్ గనమల ఉమా రాణి ఎలాగైనా అసైన్మెంట్ కమిటీ తీర్మానం ద్వారా ముసలమడుగు గ్రామం ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటిక ఐదు ఎకరముల భూమిని భూకబ్జాదారులైన తెలుగు కురుమన్నలకు కు రెండు ఎకరాలు కేటాయించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని జాతీయ మాల మహానాడు జాతీయ కార్యదర్శి సొగరాజు మునెయ్య మాల తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా గతంలో గుర్రం రాజు పొలాన్ని తాకట్టు పెట్టి బ్యాంకు లోన్ పొందిన అంశంలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్లో అట్రాసిటీ కేసు నమోదు కాబడిన తెలుగు కురుమన్నకే మరల ఎస్. సి కమ్యూనిటీ స్మశాన పొలం కేటాయించడానికి తహసీల్దార్ ఉమారాణి గారు సాహసం చేయడం చూస్తే పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. తక్షణమే కలెక్టర్ గారు జాయింట్ కలెక్టర్ గారిచే విచారణ చేయించి ముసలమడుగు గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ వాస్తవ రికార్డుల ఆధారంగా విచారించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని, ముసలమడుగు గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని కలెక్టర్ రాజకుమారి గణియ, డి.అర్.ఓ రాము నాయక్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు కార్యదర్శి సొగరాజు మునెయ్య, బీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్, ముసలమడుగు గ్రామ పెద్దలు శీలం తిరుపాలు, గుర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియాను కనుగొన్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ సేవలు చిరస్మరణీయం

**-సామాజిక వేత్త డోన్ పి. మహమ్మద్ రఫి.**

**బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ వి. సారిక**




**ఆంధ్ర ప్రగతి బేతంచెర్ల మే 13:** మే 13 న మలేరియాను కనుగొన్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ జయంతి సందర్భంగా బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల నందు సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ వి. సారిక అధ్యక్షతన మలేరియాను కనుగొన్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ వి. సారిక,సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.సర్ రోనాల్డ్ రాస్ 13 మే, 1857 జన్మించారు. ఈయన వైద్యుడు, శాస్త్రవేత్త. ఇతనికి మలేరియా పారసైట్ జీవితచక్రానికి చెందిన పరిశోధనకు గాను 1902లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రధానం చేయబడింది. 1897 లో ఒక దోమ యొక్క జీర్ణశయాంతర ప్రేగులలో మలేరియా పరాన్నజీవిని ఆయన కనుగొన్నప్పుడు మలేరియా దోమల ద్వారా వ్యాపిస్తుందని ఋజువు చేసింది. ఈ వ్యాధిని ఎదుర్కొనే పద్ధతికి పునాది వేసింది. అతను బహుముఖ ప్రజ్ఞాశాలి. భారతీయ వైద్య సేవలో 25 సంవత్సరాలు పనిచేశాడు. తన సేవలోనే అతను సంచలనాత్మక వైద్య ఆవిష్కరణ చేశాడు.సర్ రోనాల్డ్ రాస్ 16 సెప్టెంబర్, 1932 స్వర్గస్తులైనారు. ఇలాంటి మహానుభావులను ఎల్లవేళల స్మరించుకుంటు వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి,బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ వి. సారిక కోరారు.

## భక్తి శ్రద్ధలతో హెూమాలు నిర్వహిస్తే పుణ్యం లభిస్తుంది.

**-పంచభూతాల్లో అగ్ని పవిత్రమైంది. -ప్రతి మనిషిలో అగ్ని జటాయువులా పనిచేస్తుంది.**

**-దేవతా విగ్రహాలకు జలాభిషేకాలు.**





ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 13:

నంద్యాల మండలం కొత్త పల్లె గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.గ్రామంలో శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామిదేవాలయం తృతీయ వార్షికోత్సవం తో పాటు విగ్రహ ప్రతిష్ఠ,పాత చెన్నకేశవ దేవాలయం జీర్ణోధరణ ,గ్రామం ముఖద్వారం వద్ద అభయాంజనేయ స్వామి విగ్రహప్రతిస్త కార్యక్రమాలు రెండవరోజు ఘనంగా జరుగుతున్నాయి.గ్రామంలోని అందరి సహకారంతో జరుగుతున్న కార్యక్రమం ప్రతి ఇంట బంధువులతో కల,కళలాడుతుంది.ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి దంపతులు, కుటుంబసభ్యులు,గ్రామంలో అందరి సహకారంతో కన్నుల పండువగా సాగుతుంది. సుధీంద్ర ఆచార్యులు,ప్రసన్నకుమార్,సోమశేఖర శర్మ మిత్ర బృందంతో పూజలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి చైతన్యక్షేత్రం వ్యవస్థాపకులు ప్రమోద చైతన్య స్వామి, మాతాజీ అన్నపూర్ణమ్మ,తాళ్లాయపాలెం శ్రీ కోటి లింగ మహా శైవ క్షేత్ర పీఠాధిపతులు,భారత ధర్మ దేవతా ఋషిరత్మ బిరుదాంకితులు బ్రహ్మచారి పరమ పూజ్య శ్రీ శివస్వామి లు హాజరయ్యారు.గణపతి దేవుడికి పూజలు నిర్వహించారు.తులసిరెడ్డి కుటుంబసభ్యులు,గ్రామ పెద్దలు హెూమాన్ని నిర్వహించారు.పంచభూతాల్లో అగ్ని పవిత్రం.ప్రతి మనిషిలో సైతం అగ్ని జటాయువులా ఉంటుందని పురోహితులు పేర్కొన్నారు.భక్తి శ్రద్ధలతో హెూమాలు నిర్వహిస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని అన్నారు.ప్రపంచంలో జీవరాశులకు దేవుడు ప్రాణం ఎలా పోస్తారో,విశ్వకర్మలు శిల్పాని మలుస్తారని అన్నారు.విశ్వకర్మలకు తప్ప శిల్పా కల ఎవరికి సాధ్యం కాదన్నారు.రాళ్ళను దేవతా విగ్రహాలను తయారు చేయడంతో విగ్రహాల కు దోషాలు ఉంటే వాటిని పోగొట్టడానికి జలాభిషేకాలు చేస్తారనిఅన్నారు. మంగళవాయిద్యాలు ఎక్కడ ఉంటే అక్కడ భూత,ప్రేత పిచ్చాలు పారిపోతాయి అన్నారు.108 కళాశాలతో విగ్రహాల కు జలాభిషేకాలు నిర్వహించారు.మరకత లింగం,మధుర మీనాక్షి దేవి, శ్రీ మహా ధన్వంతరి, శ్రీ కాలభైరవ, శ్రీ దక్షిణా మూర్తి, శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ ఉషా ఛాయా దేవి సహిత సప్తావ్య రధారూడ శ్రీ సూర్యనారాయణ దేవత,జంట నాగ దేవతా , గరుత్మంతు విగ్రహం,అభయాంజనేయ స్వామి విగ్రహాల మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విగ్రహాల కళాశాలతో జలాభిషేకాలు చేశారు.గ్రామాల్లో ప్రతి ఇంటికి విగ్రహాలను,ధ్వజ స్తంభాలకు ప్రజలు జలాభిషేకాలు నిర్వహించారు.ఉదయం హెూమాలు, సాయంత్రం దీక్షా హెూమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు శ్రీ రామకృష్ణా విద్యా సంస్థల అధినేత జి.రామకృష్ణా రెడ్డి,యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత రెడ్డి,మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు.ఊరంతా ఒక్కటయ్యారు తలా ఒక చెయ్యి వేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## ప్రైవేట్ స్కూళ్లకు నిబంధనలు అవసరం లేదు..

## ఉచిత విద్యకు నిబంధనలు అవసరం.

**-జిల్లా విద్యాశాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలి.**

**-రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 13:**
విద్యాహక్కు చట్టం 2005 ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం బలహీన వర్గాల ప్రజలకు కేటాయించాలని అయితే ఉచిత విద్యను అప్లై చేసుకోవడానికి వెళితే కిలోమీటర్ పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు మాత్రమే చూపిస్తుంది అయితే రూరల్ ప్రాంత ప్రజలకు మండల హెడ్ కోటర్స్ మినిమం 5 నుండి 10 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది మండల హెడ్ క్వార్టర్ లోనే చాలా చోట్ల ప్రైవేట్ స్కూల్స్ ఉన్నాయి అయితే రూరల్ ప్రాంత విద్యార్థులకు ఒక కిలోమీటర్ పరిధిలోనే అప్లై చేసుకునే అవకాశం కల్పించడం వల్ల రూరల్ ప్రాంత విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది అని దీనిని జిల్లా విద్యాశాఖ అధికారులు గమనించి సంబంధిత అధికారులతో చర్చలు జరిపి కిలోమీటర్ల పరిధిలేకుండా ఉచిత విద్యకు అప్లై చేసుకునే దానికి అవకాశం కల్పించాలని వారు వివరించారు. విద్య హక్కు చట్టం ప్రకారం ఒక కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాల మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల ఉండాలనే నిబంధనలు ఉన్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ పాఠశాలకు పక్కనే ప్రైవేట్ పాఠశాలలకు పర్మిషన్ ఇస్తూ విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు,ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలకు మాత్రం నిబంధన అవసరం లేదు ఎట్ల పడితే అట్లా పర్మిషన్ ఇస్తాం ఉచిత విద్యకు మాత్రం వన్ కిలోమీటర్ పరిధిలోనే అప్లై చేసుకోవాలనే నిబంధనలు పెట్టడం విద్యాశాఖ అధికారులకు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు మధ్య ఏదో తెలియని సంబంధం ఉందని వారు విమర్శించారు, తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఉచిత విద్య ప్రకారం మండల పరిధిలో ఏ ప్రైవేట్ స్కూల్ లో అయినా చేర్పించుకోవడానికి అవకాశం కల్పించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం లేనిపక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరిస్తున్నాం.

## జిల్లా స్థాయి చదరంగం పోటీలు ప్రారంభం.

-విజేతలు రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టులో పాల్గొంటారు.

-చదరంగం ఏకాగ్రతను పెంచుతుంది: డాక్టర్ రవి కృష్ణ.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 13:** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో, జిల్లా చదరంగం సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి నిర్వహణలో మంగళవారం సంజీవ నగర్ లో ఉన్న రామకృష్ణ విద్యాలయం ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో 11సంవత్సరాల లోపు బాల బాలికల జిల్లా స్థాయి చదరంగం పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా ఎన్.ఆర్.జి .చెస్ అకాడమీ గౌరవాధ్యక్షులు రాజేష్, క్రీడాభారతి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ పాల్గొన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు అధికమవుతాయని అన్నారు. మొబైల్ ఫోన్ పిల్లలలో దుష్ప్రభావం చూపుతున్నదని, దాని నుంచి పిల్లల దృష్టి క్రీడలపై ఉండేలా చేస్తే పిల్లల మేధో వికాసం జరుగుతుందన్నారు. నిమ్మకాయల సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, కళలు వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొంటే క్రమశిక్షణ కూడా అలవడుతుందని, తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. డాక్టర్ రవికృష్ణ,రాజేష్ చదరంగం బోర్డుపై పావులు కదిలించి పోటీలు లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, క్రీడాభారతి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ రాజేష్ లతోపాటు ఆర్బిటర్ సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు కళ్యాణ చక్రవర్తి, వందమంది క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మే 20వ తేదీ న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 13:**
కార్మికులను నయా బానిసలుగా చేస్తూ పెట్టుబడిదారులకు కార్పొరేట్లకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా 11 కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం మేరకు మే 20వ తేదీ జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు పిలుపునిచ్చారు.



మంగళవారం నంద్యాల పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణంలో ఉన్న నిశాంతి భవన్లో కేంద్ర కార్మిక సంఘాల సమైక్య రౌండ్ టేబుల్ సమావేశం పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, ఏఐటీయూసీ నాయకులు ఓబులేసు, ఐఎఫ్టియు నాయకులు చౌడప్పల అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఏ నాగరాజు, సుంకయ్య, రమేష్ బాబు మాట్లాడుతూ.. కార్మికులు ఎంతో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు సివిల్ కోడ్లుగా మార్చి కార్మికులను యాజమాన్యాలకు కత్తు బానిసలుగా చేస్తూందని దీనికి వ్యతిరేకంగా మే 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ఉద్యోగులు కార్మికులు ప్రజలందరూ జయప్రదం చేయాలని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లాభాల్లో నడుస్తున్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను ఎల్ఐసి బ్యాంకులో రైల్వేలు ప్రైవేటీకరణ చేయడం వల్ల ఇందులో పని చేసే కార్మికులు ను తొలగించి ప్రయత్నం చేస్తుందని బ్రిటిష్ కాలం నుంచి తెచ్చినటువంటి చట్టాలను తుంగలో తొక్కి కనీస వేతనాలు చట్టం సమ్మె చేసే హక్కులను ముఖ్యమైనటువంటి చట్టాలను తొలగించే ప్రయత్నం చేస్తుందని వారు అన్నారు. 14వ మహాసభ సిఫారస్ 1992 సుప్రీంకోర్టు తీర్పును పరిగణంలోనికి తీసుకొని కనీస వేతనం 26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, భారత కార్మిక మహాసభ సిఫారసులకు అనుగుణంగా స్కీం వర్కర్లను వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం, సామాజిక భద్రత ఉద్యోగభద్రత అమలు చేయాలని రాష్ట్రంలో దేశంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి చట్ట ప్రకారం పర్మినెంట్ కార్మికులు చేసే పని కాంట్రాక్టు కార్మికులు చేస్తే వారికి పర్మినెంట్ కార్మికులకు వేతనం అలవెన్స్ బెన్ఫిట్ లు ఇవ్వాలని సుప్రీంకోర్టు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పిన తీర్పును అమలు చేయాలని కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని బీడీ, బిల్డింగ్ కార్మికుల సంక్షేమ పథకాలు మరియు లేబర్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన బిల్డింగ్ కార్మికుల సంక్షేమ నిధిని తిరిగి జమ చేయాలని ముఠా లారీ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈపీఎఫ్ కనీస పెన్షన్ పది వేలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్స్ సాధన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ కార్మికులు ఉద్యోగులంతా మే 20వ తేదీ జరగబోయే సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం, జిల్లా కార్యదర్శులు వి బాల వెంకట్, వెంకటలింగం, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాయుడు, ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు మౌలాలి మాట్లాడుతూ మే 25 జరగబోయే సమ్మెను కార్మికులంతా ఐక్యంగా జయప్రదం చేయాలని ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట.మద్దులు, పట్టణ కార్యదర్శి కే యం డి గౌస్, ఆశ,అంగన్వాడి యూనియన్ నాయకురాలు లక్ష్మీదేవి, సునీత, చంద్రకళ, వేదవతి, సుబ్బారావు,సుశీలమ్మ తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊరట

### సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో బెయిల్ మంజూరు



విజయవాడ,**మే 13 ఆంధ్ర ప్రగతి:**
మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊరట దక్కింది. టీడీపీ కార్యకర్త సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టయిన అతడికి ఎస్సీ, ఎస్టీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో 90 రోజులకు పైగా జైల్లో ఉన్న వంశీ.. ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇటీ–వల ఇరు వర్గాల తరపు న్యాయవాదుల వాదనలు విన్న కోర్టు నేడు డిఫెన్స్ వాదనలతో ఏకీభవిస్తూ వంశీకి బెయిల్ మంజూరు చేసింది. వంశీ తోపాటు– మరో నలుగురికి కూడా బెయిల్ మంజూరు చేసింది. 2023లో గన్నవరం టీ–డీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసును నీరు కార్చేందుకు వైసీపీ నేత వల్లభనేని వంశీ పన్నిన పథకం తిరిగి ఆయన మెడకే చిక్కుకుంది. టీ–డీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదు వాపస్ తీసుకునేలా తన సోదరుడు ముదునూరి సత్యవర్ధన్ను బెదిరించి, భయపెట్టారని... కిడ్నాప్ కూడా చేశారని కిరణ్ అనే యువకుడు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వల్లభనేని వంశీని ప్రధాన నిందితుడిగా పేర్కొని హైదరాబాద్లో అతడిని అరెస్ట్ చేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసును నీరుగార్చే ఉద్దేశంతోనే వల్లభనేని వంశీ, అతడి అనుచరులు సత్యవర్ధన్ను కిడ్నాప్ చేయడంతోపాటు– దాడి చేశారని పోలీసు దర్యాప్తులో తేలింది. తనకు అనారోగ్యంగా ఉందని రెండు సార్లు బెయిల్ మంజూరు కోరుతూ ఎస్సీ ఎస్టీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, రెండు పిటిషన్లు తిరస్కరించిన న్యాయస్థానం మూడోసారి బెయిల్ పిటిషన్ను అంగీకరించింది. తనకు అనారోగ్యంగా ఉందని, ఊపిరి తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందిగా ఉందని కోర్టుకు వల్లభనేని వంశీ వివరించడంతో డిఫెన్స్ వాదనలను ఏకీభవిస్తూ బెయిల్ మంజూరు చేసింది.

## పదవీవరమణ చేసిన జస్టిస్ట్ సంజీవ్ ఖన్నా

న్యూఢిల్లీ,**మే 13 ఆంధ్ర ప్రగతి:**
భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం మంగళవారం తో ముగిసింది. సుప్రీంకోర్టులో చివరి రోజు బెంచ్ కార్యలాపాలు ముగిసిన తర్వాత ఏర్పాటు– చేసిన కార్యక్రమంలో జస్టిస్ ఖన్నా మాట్లాడారు. తదుపరి ఎటువంటి అధికారిక పదవులను చేపట్టనని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థలోనే ఏదైనా చేయాలనుకుంటున్నానని చెప్పారు. మరోవైపు జస్టిస్ ఖన్నా పదవీ విరమణ నేపథ్యంలో సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది.



భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా గతేడాది నవంబర్ 11 బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా సమీప బంధువు. 2005లో దిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా నియమితులైన జస్టిస్ ఖన్నా.. ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, నవంబర్ 11న సీజేఐగా బాధ్యతలు చేపట్టారు. ఖన్నా పదవీవిరమణతో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మే 14న బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నూతన సీజేఐతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. సీనియారిటీ పరంగా తన తర్వాత స్థానంలో ఉన్న జస్టిస్ గవాయ్ పేరును.. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా గతంలోనే సిఫారసు చేయడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 6 నెలలకుపైగా సీజేఐ పదవిలో కొనసాగనున్న జస్టిస్ గవాయ్.. నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు. డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్లో ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆరు నెలలు మాత్రమే సేవలందించారు. దీంతో ఆయన పదవీ కాలం ముగిసింది. ఈ క్రమంలో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ నేడు రాష్ట్రపతి భవన్లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.జస్టిస్ సంజీవ్ ఖన్నా.. న్యూఢిల్లీలో 1960, మే 14న జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్లో న్యాయశాస్త్రాన్ని చదివారు. ఢిల్లీ హైకోర్టులో 2005లో అదనపు న్యాయమూర్తిగా నియమితుల య్యారు. 2006లో శాశ్వత జడ్జి అయ్యారు. 2019, జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన పలు ప్రముఖ తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల వినియోగాన్ని ఆయన సమర్థిస్తూ.. అవి పూర్తి భద్రమైనవని, దాని వల్ల బోగస్ ఓట్లు, బూత్ల రిగ్గింగ్ను అరికట్టవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఎలక్టోరల్ బాండ్లపై సంచలన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో ఖన్నా కూడా ఉన్నారు. 370 అధికరణ రద్దును సమర్థిస్తూ తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో కూడా ఆయన సభ్యుడే. కాగా తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్ పేరును సీజేఐ ఖన్నా ఏప్రిల్ 16న కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. 2019 మే 24న సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలలకుపైగా కొనసాగుతారు. 2025 నవంబర్ 23న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కావడం విశేషం. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించిన జస్టిస్ గవాయ్.. 1985 మార్చి 16న బార్లో సభ్యుడిగా చేరారు. 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 12న అదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనేక చరిత్రాత్మక తీర్పులను వెలువరించిన సుప్రీంకోర్టుకు చెందిన పలు రాజ్యాంగ ధర్మాసనాలలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. పూర్వ జమ్మూ కశ్మీరు రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ సభ్యుడిగా ఉన్నారు. రూ. 1000, రూ. 500 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం 2016లో తీసుకున్న నిర్ణయాన్ని 4:1 మెజారిటీతో ఆమోదించిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ పాత్ర ఉంది. ఎస్సీల వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్రాలకు అధికారాలను అందచేస్తూ 6:1 మెజారిటీతో తీర్పును వెలువరించిన ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ ఉన్నారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఓ ముఖ్యమైన తీర్పును వెలువరిస్తూ 15 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఏ ఆస్తినీ కూల్చరాదని ఆదేశిస్తూ దేశవ్యాప్తంగా మార్గదర్శకాలు జారీచేసింది.

## కొండవీడు కోటను అభివృద్ధి చేయండి

### కేంద్రమంత్రి షెకావత్ను కోరిన లావు

న్యూఢిల్లీ**మే 13 ఆంధ్ర ప్రగతి:** కొండవీడుకోటను గొప్ప పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయని నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయులు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. దీని అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. మంగళవారం దిల్లీలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్తో ఎంపీ, ఎమ్మెల్యే భేటీ అయ్యారు. పల్నాడు జిల్లాలోని కొండవీడు కోటకు సంబంధించిన వివరాలను కేంద్రమంత్రికి ప్రత్తిపాటి వివరించారు. 2018లో రూ.40కోట్లతో కొండవీడు కోటకు ఘాట్ రోడ్డు వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దీన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మార్చవచ్చు. కోటకు ఇన్క్రెడిబుల్ ఇండియా, దేఖో అప్నా దేశ్ విభాగాల్లో ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని వివరాలు తెలుసుకొన్న కేంద్ర మంత్రి.. కొండవీడు కోటను ప్రపంచ వారసత్వ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఈతకు వెళ్లిన ఐదురుగు బాలుర గల్లంతు

కడప,**మే 13 ఆంధ్ర ప్రగతి::** వైఎస్ఆర్ కడప జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. చెరువులోకి ఈతకు వెళ్లిన ఐదుగురు బాలురు గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. చెరువులో గల్లంతైన మిగతా వారి కోసం పోలీసులు, గ్రామస్తులు గాలిస్తున్నారు. చెరువు వద్ద ఐదుగురు బాలురికి సంబంధించిన దుస్తులు ఉండడంతో ఐదుగురు నీట మునిగి నట్లు–భావిస్తున్నారు. ఈ విషాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

----

## తెలంగాణ రాష్ట్రంలో చురుకుగా ధాన్యం కొనుగోళ్లు

### ఇప్పటి వరకు 61.45 శాతం యాసంగి ధాన్యం సేకరణ

హైదరాబాద్,**మే 13 ఆంధ్ర ప్రగతి:**): తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 61.45 శాతం యాసంగి వడ్ల కొనుగోళ్లు పూర్తి అయినట్లు– పేర్కొనింది. మే 12వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 43.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది అన్నారు. ఇక, 2023– 24 సంవత్సరం ఇదే సమయానికి 29.88 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి.. 2022–23లో 19.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు–చెప్పుకొచ్చారు. అయితే, గత ఏడాదితో పోలిస్తే యాసంగి సీజన్లో
రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు– చేసిందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. 2023– 24లో 7,178 కేంద్రాలు ఏర్పాటు– చేయగా.. ఈసారి 8,245 కేంద్రాలు నెలకొల్పింది. ఈ ఏడాది యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.. మొత్తం 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తం 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేసింది.

## మహానాడు నిర్వహణపై నేడు నిర్ణయం

అమరావతి, **మే 13 ఆంధ్ర ప్రగతి:**టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఆ పార్టీ పొలిట్బ్యూరో సమావేశం జరగనుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడోసారి జరుగుతున్న ఈ భేటీకి పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షత వహిస్తారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించతలపెట్టిన మహానాడుపై ప్రధానంగా చర్చ జరగనుంది. గతేడాది ఎన్నికల షెడ్యూల్ కారణంగా దీనిని నిర్వహించలేకపోయారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చినందున ఈ ఏడాది భారీగా జరపాలని భావించారు. అయితే పహల్గాంలో ఉగ్రవాదుల దాడి.. దానికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' కారణంగా నిన్నమొన్నటివరకు దేశవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల దృష్ట్యా మహానాడు వేడుకలు మూడ్రోజులు నిర్వహించాలా లేక రెండ్రోజులకు కుదించాలా అన్న అంశంపై పొలిట్బ్యూరోలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే సంస్థాగత నిర్మాణంలో సంస్కరణలు చేపట్టాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పదే పదే కోరుతున్నారు. దీనిపై పొలిట్బ్యూరోలో చర్చించనున్నారు. జగన్ హయాంలో 2019–24 మధ్య టీడీపీ శ్రేణులపై పెట్టిన అక్రమ కేసుల ఎత్తివేత అంశం సైతం చర్చకు వస్తుందని అంటున్నారు. కాగా, ఎమ్మెల్యేల స్థాయిలో ప్రజాదర్బార్ నిర్వహణ సరిగా లేదని టీడీపీ భావిస్తోంది. నియోజకవర్గాల్లో ప్రజాదర్బార్లు ఏర్పాటు చేసి ఫిర్యాదుల స్వీకరణతోపాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించనుంది. దీని కోసం విధివిధానాలను పొలిట్బ్యూరో ఖరారు చేయనుంది. బుధవారంనాటి భేటీలో పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి, పాకిస్థాన్ దాడిలో అమరులైన జవాన్లకు.. ఇటీవల మరణించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకూ సంతాపం తెలుపనుంది.

# చార్మినార్ వద్ద సుందరీమణుల సందడి

## గ్రూప్ ఫోటోలు దిగిన అందాల అతివలు

## లాడ్ బజార్‌లో షాపింగ్ చేసిన ముద్దుగుమ్మలు



హైదరాబాద్,**మే 13 ఆంధ్ర ప్రగతి:**ప్రపంచ సుందరీమణులు మంగళవారం సాయంతరి హైదరాబాద్ పాతబస్తీలో సందడి చేశారు. చార్మినార్ దగ్గర 109 దేశాల అందగత్తెలకు రెడ్ కార్పెట్ తో.. సంప్రదాయ అరబ్బీ మర్ఫా సంగీతంతో స్వాగతం పలికారు. చార్మినార్ అందాలను, చుట్టుపక్కల ప్రాంతాలను తమ సెల్ ఫోన్లలో బంధించుకున్నారు. ఆ తర్వాత చార్మినార్ దగ్గర ప్రత్యేక ఫోటో షూట్‌నిర్వహించారు. లాడ్ బజార్ లోని తొమ్మిది ప్రముఖ దుకాణాల్లో ఈ సుందరీమణులు షాపింగ్ చేసారు. గాజులు, ముత్యాల హారాలు, ఇంకా అలంకరణ వస్తువులు కొనుగోలు చేయడమే కాక.. అక్కడే గాజులు తయారీ విధానాన్ని కూడా స్వయంగా వీరు పరిశీలించారు. నాలుగు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూప్ రెండు షాప్ లలో షాపింగ్ చేసేలా ఏర్పాట్లు- చేశారు. అనంతరం చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. హెరిటేజ్ వాక్ కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ విధించారు. పహెల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాతబస్తీ వీధులన్నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదీనా, చార్మినార్, శాలిబండ, వొల్గా జంక్షన్, ఖిల్వత్ రోడ్లను పూర్తిగా క్లోజ్ చేశారు. ఇవాళ రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# ఎపి సైనిక్ స్కూల్లో తెలంగాణ పిల్లలకు అవకాశం ఇవ్వాలి: పొన్నం



హైదరాబాద్,**మే 13 ఆంధ్ర ప్రగతి:**రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు- చేసే వరకు ఏపీలో తెలంగాణ పిల్లలకు స్థానికత్వం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్రం, ఏపీ సర్కార్ నిర్ణయంతో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసిన 20వేల మంది విద్యార్థులు నైరాశ్యంలో ఉన్నట్లు- తెలిపారు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఉన్నాయని, తెలంగాణలో తొందరగా ఏర్పాటు- చేయాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో నారావారి నరకాసుర పాలన

## మహిళలకు రోణ లేకుండా పోయింది

## మాజీ మంత్రి ఆర్కే రోజా వ్యాఖ్య



అమరావతి,**మే 13 ఆంధ్ర ప్రగతి:**

రాష్ట్రంలో నారావారి నరకాసుర పాలన నడుస్తుందని మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత ఆర్కే రోజా వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పాలన, సీఎం చంద్రబాబు కుటుంబంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ మహిళా కార్యకర్తలు నారావారి నరకాసుర వధ చేసేందుకు నడుం బిగించాలి అంటూ పిలుపునిచ్చారు… చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక అరాచకాలు, అఘాయిత్యాలు, అక్రమ కేసులు, అవమానాలు, అత్యాచారాలు, వేధింపులు.. ఇవే సూపర్ సిక్స్‌లు అంటూ ఎద్దేశా చేశారు.. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఏమేమి హామీలు ఇచ్చారు.. ఏమేమి నెరవేర్చారో అందరికీ తెలుసన్నారు.. ప్రతీ కుటుంబం గత ప్రభుత్వ హయాంలో లబ్ది పొందారు.. కూటమి ప్రభుత్వం ఆ పార్టీ మహిళలను కూడా మోసం చేసిందని మండిపడ్డారు.. ఉగ్రవాదులకు మనకు మధ్య జరిగిన యుద్ధంలో ముందుండి నడిపిందే మహిళలు అని ప్రశంసించారు. అయితే, సోషల్ మీడియాలో మహిళలను ఎలా టార్గెట్ చేయాలో టీడీపీ వాళ్లు నేర్పిస్తూ ఆర్గనైజ్డ్ క్రైమ్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు.. అధికారంలో ఉన్నా.. లేకున్నా జగనన్న ఎప్పుడూ మహిళలకు అండగా ఉంటారని మాజీ మంత్రి ఆర్కే రోజా వ్యాఖ్యానించారు.

# రేపటినుంచి సిఫారసు లేఖలకు అనుమతి

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి



తిరుమల,**మే 13 ఆంధ్ర ప్రగతి:**తిరుమలలో గురువారం నుంచి వీఐపీ సిఫారసు లేఖలు స్వీకరిస్తామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తెలుగురాష్ట్రాల ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై 15 నుంచి నుంచి బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పారు. కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి అనునిత్యం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.. ఇక, సెలవు రోజుల్లో ఆ సంఖ్య మరింత భారీగా ఉంటుంది.. వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా.. సిఫార్సు లేఖలపై శ్రీవారి బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయం తీసుకుంది. అయితే, తిరుమలలో భక్తుల రద్దీ సాదారణంగానే ఉంది.. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీ తగ్గిన నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది.. శ్రీవారి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలను తిరిగి స్వీకరించాలని నిర్ణయించింది. మే 15వ తేదీ నుంచి.. సిఫార్సు లేఖలపై బ్రేక్ దర్శనాలు కేటాయింపు పునః ప్రారంభించనున్నట్టు పేర్కొంది.. మే 1 నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు గతంలో తితిదే ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, తితిదే బోర్డు సభ్యుల సిఫార్సు లేఖలు చెల్లవని వెల్లడించింది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పింది. వేసవి సెలవుల దృష్ట్యా తితిదే ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. ఆ గడువును తగ్గించి మే 15 నుంచి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

# దేశంలో తుర్కియా వ్యతిరేక నినాదం

## ఆ దేశ యాపిల్ల అమ్మకాలపై నిషేధం

పుణె,**మే 13 ఆంధ్ర ప్రగతి:**

పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించడం పై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వస్తోంది. దీంతో టర్కీ ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా 'బ్యాన్ తుర్కియే' అంటూ పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్‌కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఈ క్రమంలో తాజాగా పుణెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్‌లను బహిష్కరిస్తున్నట్లు- నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లను తీసుకుంటున్నారు. పుణెలో మార్కెట్‌లో తుర్కియే యాపిల్‌ల సీజన్





టర్నోవర్ రూ.1000 నుంచి 1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీంతో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంటున్నారు. యాపిల్‌లను అక్కడ నుంచి దిగుమతి చేసుకునే బదులు హిమాచల్, ఉత్తరాఖండ్, ఇరాన్, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. మరోవైపు, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కుల్‌దీప్ సింగ్ రాథోడ్ కూడా తుర్కియే తీరుపై ఇటీవల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2023లో భీకర భూకంప సమయంలో 'ఆపరేషన్ దోస్త్' ద్వారా భారత్ టర్కీ దేశానికి ఎంతో సాయం చేసిందని, అయినప్పటికీ ఆ దేశం దౌత్య ద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అక్కడి దిగుమతులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సైనిక విమానాలు, యుద్ధనౌకను తుర్కియే పంపించినట్లు- వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగిస్తోందని సమాచారం. పహల్గాం దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా దేశంలో నిరసనలు వస్తున్నాయి. తుర్కియా వస్తువును బహిష్కరించాలన్న పిలుపు ఊపందుకుంది.

# ఆపరేషన్ సిందూర్‌తో భారీగా నష్టం

## మెల్లగా వాస్తవాలు అంగీకరిస్తున్న పాక్ -11మంది సైనికులు చనిపోయారన ఆర్మీ వెల్లడి

ఇస్లమాబాద్,**మే 13 ఆంధ్ర ప్రగతి:** పహల్గామ్ దాడి తర్వాత భారత్ తీసుకున్న చర్యల కారణంగా పాకిస్తాన్ భారీ నష్టాలను చవిచూసింది. ఆపరేషన్ సిందూర్‌లో, పాకిస్తాన్‌లో పెంచి పోషించిన అనేక మంది భయంకరమైన ఉగ్రవాదులను నాశనం చేశారు. ఆ తర్వాత పాక్ భారత్ పై దాడి చేసింది. భారత్ జరిపిన ప్రతీకార దాడుల్లో చాలా మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. పాకిస్తాన్ స్వయంగా దీనిని అంగీకరించింది. భారత సైన్యం జరిపిన దాడిలో 11 మంది పాకిస్తాన్ సైనికులు మరణించగా, 78 మంది గాయపడ్డారని పాకిస్తాన్ ఆర్మీ మీడియా విభాగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పహల్గామ్ దాడి తర్వాత ఉగ్రవాదులను నిర్మూలిస్తామని భారత్ ప్రతిజ్ఞ చేసి ఆపరేషన్ సిందూర్ ప్రారంభించినప్పుడు భారత్, పాకిస్తాన్ మధ్య సైనిక ఘర్షణ జరిగింది. ఈ దాడిలో చాలా మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. డాన్ వార్తాపత్రిక ప్రకారం, మరణించిన పాకిస్తాన్ ఆర్మీ సైనికులలో నాయక్ అబ్దుల్ రెహ్మాన్, లాన్స్ నాయక్ దిలావర్ ఖాన్, లాన్స్ నాయక్ ఇక్రముల్లా, నాయక్ వకార్ ఖలీద్, సిపాయి ముహమ్మద్ ఆదిల్ అక్బర్, సిపాయి నిసార్ ఉన్నారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పాకిస్తాన్‌లోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేసింది. వైమానిక దాడిలో అనేక ఉగ్రవాద శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు, ఆపరేషన్ సింధూర్‌పై పాకిస్తాన్ ప్రభుత్వం, పాకిస్తాన రాజకీయ నేతలు తప్పుడు



కథనాలను చెబుతూనే వస్తున్నారు. ఈ యుద్ధంలో పాకిస్తాన్ విజయం సాధించిందంటూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పాడు. మరోవైపు, పాక్ వ్యాప్తంగా విక్టరీ ర్యాలీలు తీస్తున్నారు. ఈ ర్యాలీల్లో మాజీ క్రికెటర్ అఫ్రిదితో పాటు-
పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. భారత్ ఓ వైపు క్లియర్‌గా శాటిలైట్ చిత్రాలతో పాకిస్తాన్‌కి జరిగిన నష్టాన్ని చూపిస్తుంటే, మరోవైపు తమకు ఏం కాలేదు, భారత్ తీవ్రంగా నష్టపోయిందని ఒక ఫేక్ ప్రచారాన్ని పాకిస్తాన్ చేస్తోంది. ఇదెలా ఉంటే, తాజాగా పాకిస్తాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ.. భారత్ తమ 11 వైమానిక స్థావరాలపై క్షిపణి దాడి చేసినట్లు- అంగీకరించారు. భారతదేశంతో జరిగిన ఘర్షణల్లో పాకిస్తాన్ విమానాలు దెబ్బతిన్నట్లు- చెప్పాడు. పాకిస్తాన్ జెట్‌ని భారత్ కూల్చినట్లు స్పష్టమైన ఆధారాలతో వెల్లడించింది. అయితే, ఇషాక్ దార్ మాత్రం తమ జెట్ స్వల్పంగా దెబ్బతిన్నట్లు- అంగీకరించారు. భారత పైలట్ ఎవరూ కూడా పాకిస్తాన్ వద్ద లేరని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా పాకిస్తాన్ లోని చాలా కీలమైన ఎయిర్ బేస్‌లపై భారత్ తీవ్రంగా విరుచుకుపడింది. శనివారం తెల్లవారుజామున రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తో సహా సర్గోదా, రఫికీ, జకోబాబాద్, స్కర్దు వంటి ఎయిర్ బేస్‌లపై విరుకుపడింది. మొత్తంగా భారత్ పాక్‌కి చెందిన 11 వైమానిక స్థావరాలను దెబ్బతీసింది. ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన తర్వాత 35-40 మంది పాకిస్తాన్ సైనిక సిబ్బంది మరణించినట్లు- భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు.

# రక్తదానం మానవత్వానికి మరో రూపం..

## రక్తదానంపై యువతలో చైతన్యం రావాలి.. సమాజంలో ఉన్న అపోహలను తొలగిద్దాం

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

విజయవాడ,**మే 13 ఆంధ్ర ప్రగతి:**

రక్తదానం మానవత్వానికి మరో రూపమని ప్రాణాపాయి స్థితిలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించడం ప్రాణాలను కాపాడడం మరో జన్మనివ్వడమేనని, రక్తదానం చేయడంవల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని సమాజంలో ఉన్న అపోహలను తొలగించి రక్తదానానికి ముందుకు వచ్చేలా యువతను ప్రోత్సహించడం అభినందనీయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. స్థానిక సూర్యరావు పేట నక్కలరోడ్డులోని శ్రీధర్ కోచింగ్ సెంటర్ నందు మంగళవారం నిర్వహించిన మోగా రక్తదానం శిభిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రక్తదానం చేయడం మానవత్వానికి మరో రూపంగా భావించాలన్నారు. ప్రాణాపాయి స్థితిలో ఉన్నప్పుడు సకాలంలో రక్తం లభించకపోవడం వలన ఎంతో మంది ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. కార్ల్ ల్యాండ్ స్టీనర్ అనే ఒక మానవతావాది రక్తంలో ఉండే గ్రూపులను వర్గీకరించి ఉండకపోతే ప్రపంచంలో ఇప్పటికీ రక్తమార్పిడి కారణంగా మరణాలు సంభవించేవన్నారు. రాష్ట్రంలో అనేక మంది రక్త హీనతతో భాదపడుతున్నారని సుమారు 6 వేల మందికి పైగా తలసీమియా వ్యాధికి గురి కావడం జరిగిందని వీరి ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం రక్త మార్పిండి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం అనేది ప్రాణదానం లాంటిద అన్నారు. ప్రమాదానికి గురి అయినప్పుడు,



అత్యవసర శస్త్ర చికిత్సల సమయంలో రక్త అవసరం వుంటు-ందన్నారు. రక్తాన్ని దానం మాత్రమే చేయవచ్చునని ఉత్పత్తి చేయలేమన్నారు. రక్త అవసరమయ్యే జీవితాలకు రక్తదాతలే ప్రాణదాతలన్నారు. 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు వరకు రక్తదానం చేయవచ్చునని, జీవిత కాలంలో ఒక వ్యక్తి దాదాపు 168 సార్లు రక్తాన్ని దానం చేయవచ్చునన్నారు. రక్తదానంతో నీరసించి పోతామనే అపోహను తొలగించి రక్తదానం చేసిన ప్రతీ సారి ఆరోగ్యవంతమైన కొత్త రక్తాన్ని పొందగలుగుతామనే విషయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లి రక్తదానం వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు. కొత్త యువత కూడా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలలో పాల్గొనేలా స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ఉందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.





అత్యున్నత ప్రమాణాలతో పోటీ- పరీక్షలకు యువతను సన్నద్ధులను చేయడంతో పాటు- సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మోగా రక్తదానం శిభిరాలను ఏర్పాటు- చేసిన శ్రీధర్ కోచింగ్ సెంటర్ నిర్వహులను అభినందిస్తున్నానన్నారు. దేశ ప్రగతిలో యువత పాత్ర కీలకమన్నారు. యువతలో మెదోశక్తిని పెంపొందించి వారిని అన్ని రంగాలలో అగ్రగామిగా నిల్వాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు- మెరుగైన ఉపాధి అవకాశాలను చర్యలు తీసుకుంటు-ందని వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో శ్రీధర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కొమ్మూరి శ్రీధర్, సీతారామిరెడ్డి, డా. మధన్ మోహన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 14 మే 2025

# ఆధ్యాత్మిక సేవలో కోహ్లీ దంపతులు..



టీమిండియా స్టార్ ప్లేయర్ మాజీ కెప్టెన్ కింగ్ కోహ్లీ సోమవారం టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అయితే టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన మరుసటి రోజు కోహ్లీ తన సతీమణి అనుష్కశర్మతో కలిసి యూపీలోని బృందావన్ దామ్‌ను సందర్శించారు. అక్కడ ఆధ్యాత్మిక గురువైన ప్రేమానంద్ మహారాజ్ కలిసిన కోహ్లీ, అనుష్క దంపతులు ఆధ్యాత్మిక గురువు నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అక్కడికి వచ్చిన ఈ జంటకు ప్రేమానంద్ మహారాజ్ ఆధ్యాత్మిక బోధనలు చేశారు. అయితే కోహ్లీ దంపతులు ఈ ఆశ్రమాన్ని సదర్శించడం ఇదే మొదటి సారి ఏం కాదు.. ఇంతకు ముందు కూడా చాలా సార్లు వీరు ఇక్కడికి వచ్చారు.అయితే కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత వ్యక్తిగతంగా పాల్గొన్న మొదటి కార్యక్రమం ఇది. ఈ ఆధ్యాత్మిక క్షేత్రంలో సెలబ్రిటీ దంపతులను చూసిన కొందరు అభిమానులు ఈ ఫోటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీంతో ఇందుకు సంబంధించిన ఫోటోలు వైరల్‌గా మారాయి. అయితే విరాట్ కోహ్లీ తన 14 ఏళ్ల సుదీర్ఘ టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌కు సోమవారం గుడ్‌బై చెప్పారు. అయితే 2011లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌తో కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన కోహ్లీ ఇప్పటి వరకు 123 మ్యాచ్‌లు ఆడాడు. అయితే కోహ్లీ టెస్టుల్లో ఇప్పటి వరకు 9,230 పరుగులు చేయగా అందులో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే తాజాగా టెస్ట్ క్రికెట్, గతంలో భారత్ టీ20 వరల్డ్ కప్ తర్వాత టీ20 ఫార్మట్‌లకు గుడ్‌బై చెప్పిన కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగనున్నాడు.

......

# రోహిత్, విరాట్ కు ఫేర్‌వెల్ కూడా ఇవ్వరా

## ఘనంగా సత్కరించాలని అభిమానుల కోరిక




టీమ్‌ఇండియా లెజెండ్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆకస్మత్తుగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ షాకకు గురిచేశారు. జూన్‌లో జరగనున్న ఇంగ్లాండ్ పర్యటనకు ఈ ఇద్దరు సీనియర్లు జట్టుతో వెళ్తారని అంతా ఆశించారు. కానీ, మే 07న సడెన్‌గా సుదీర్ఘ ఫార్మాటకు వీడ్కోలు పలుకుతున్నట్లు రోహిత్ ప్రకటించగా, తాజాగా విరాట్ కూడా టెస్టులకు గుడ్ బై చెప్పేశాడు. 2024- 25 ఆస్ట్రేలియా పర్యటన బోర్డర్ గావస్కర్ ట్రోఫీనే ఈ ఇద్దరికి ఆఖరి టెస్టు సిరీస్.అయితే దశాబ్ద కాలంగా టీమ్‌ఇండియా అనేక విజయాల్లో రో-కో (రోహిత్, కోహ్లీ) ద్వయం పాత్ర అత్యంత కీలకం. టీ20, వన్డే, టెస్టుల్లో ఈ ఇద్దరు అనేక విజయాలు అందించారు. ఇప్పుడు సడెన్‌గా టెస్టుల్లోంచి తప్పుకోవడం వల్ల వీరికి ఫేర్‌వెల్ మ్యాచ్ అంటూ ఏదీ లేదు. ఎవరైన ప్లేయర్ కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడుతున్నాడంటే ఆయా దేశాల బోర్డులు ఫేర్‌వెల నిర్వహించి ఆటగాళ్లను గౌరవిస్తాయి.రోహిత్, విరాట్ విషయంలో అలా జరగలేదు. గతేడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియా సిరీస్‌లో నాలుగో టెస్టు రోహిత్ కెరీర్‌లో ఆఖరిది. అదే సిరీస్‌లో ఐదో మ్యాచ్ విరాటకు చివరి టెస్టు. అంటే తమతమ కెరీర్‌లో ఇప్పటికే ఆఖరి టెస్టు ఆడేశారు. అయినప్పటికీ ఈ ఇద్దరికీ ఫేర్‌వెల్ నిర్వహించి ఘనంగా సత్కరించాలని అభిమానులు బీసీసీఐను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు తమ ప్లేయర్ జేమ్స్ అండర్సన్‌ను గౌరవంగా సత్కరించిన సందర్భాన్ని గుర్తుచేస్తున్నారు. రోహిత్‌కు వాంఖడే, విరాటకు దిల్లీ స్టేడియాల్లో ఫేర్‌వెల్ నిర్వహించాలని కోరుతున్నారు. 2011లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన కోహ్లీ భారత్‌కు 123 టెస్టుల్లో ప్రానిధ్యం వహించాడు. ఈ ఫార్మాటలో 9230 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అలాగే కెప్టెన్‌గా 68 మ్యాచ్‌ల్లో 40 విజయాలు అందించాడు. మరోవైపు, 2013 నవంబర్‌లో వెస్టిండీస్‌పై టెస్టుల్లోకి ఎంట్రీ ఇచ్చిన రోహిత్ భారత్ తరఫున 67 మ్యాచ్‌లు ఆడాడు. 40.58 సగటున 4301 పరుగులు చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 88 సిక్స్‌లు బాదాడు.

# టైటిల్ రేసులో ఉన్న బెంగళూరుకు ఏం జరుగుతోంది




ఇప్పటివరకు ఐపీఎల్‌లో పెద్దగా రాణించలేకపోయిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ ఈ ఏడాది సీజన్‌లో మాత్రం అద్భుతంగా ఆడుతోంది. రజత్ పటీదార్ సారథ్యంలోని ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ సీజన్‌లో టైటిల్ ఫేవరెట్ జట్లలో ఒకటిగా నిలిచింది. అయితే ఆ జట్టును దురదృష్టం వెంటాడుతోంది. ఆ జట్టు వరుస విజయాలు సాధిస్తున్న దశలో భారత్-పాక్ ఉద్రిక్తతల కారణంగా టోర్నీ వాయిదా పడింది. టోర్నమెంట్ త్వరలో తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కానీ ఇంతలో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ చేతి వేలి గాయం కారణంగా ఇబ్బందిపడుతున్నాడు. అతడు మరో మూడు, నాలుగు మ్యాచ్‌లు ఆడే అవకాశం కనిపించడం లేదు. దీంతో జితేష్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగించబోతున్నారు. ఇక, ఆ జట్టు స్టార్ బౌలర్ అయిన జాష్ హాజెల్‌వుడ్ కూడా తిరిగి ఆర్సీబీ తరఫున మైదానంలో దిగే అవకాశాలు లేవు.ఆస్ట్రేలియాకు చెందిన హాజెల్‌వుడ్ జూన్ 11వ తేదీన దక్షిణాఫ్రికాతో జరిగే ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లో ఆడాల్సి ఉంది. హాజెల్‌వుడ్ ఆస్ట్రేలియాకు కీలక బౌలర్ అనే సంగతి తెలిసిందే. దీంతో అతడు ఆర్సీబీ ఆడే మిగతా మ్యాచ్‌లకు అందుబాటులో ఉండే అవకాశం కనిపించడం లేదు. అతడు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనాల్సిన అవకాశం ఉంది. పటీదార్, హాజెల్‌వుడ్ ఆర్సీబీకి కీలక ఆటగాళ్లు అనే సంగతి తెలిసిందే. వీరిద్దరూ దూరమైతే జట్టుపై తీవ్ర ప్రభావం పడడం మాత్రం ఖాయం.



# జొకో కోచ్‌గా మర్రే కటీఫ్

లండన్: ఫ్రెంచ్ ఓపెన్‌కు రెండు వారాల ముందు సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిక్ కోచ్‌గా ఆండీ మర్రే వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. జొకోవిక్ కోచ్‌గా తాను వైదొలుగుతున్నట్లు మంగళవారం సోషల్ మీడియా వేదికగా ప్రపంచ మాజీ నెంబర్ వన్ మర్రే ప్రకటించాడు. తామిద్దరం ఇక కలిసి ప్రయాణం చేయబోవడం లేదని మర్రే పేర్కొన్నాడు. అనంతరం ఈ ఆరు నెలల ప్రయాణంలో మర్రే తన కోసం శ్రమించిన విధానం, తను పంచిన వినోదం, అందించిన మద్దతును కొనియాడుతూ నొవాక్ సోషల్ మీడియాలో ఒక సందేశం పోస్ట్ చేశాడు. ఈ ప్రయాణంతో తమ స్నేహం మరింత బలపడిందని నొవాక్ తెలిపాడు.




# విదేశీ ఆటగాళ్లకై ఎదురుచూపులు

న్యూఢిల్లీ: ఈనెల 17 నుంచి ఐపీఎల్ తిరిగి ఆరంభం కానుండడంతో విదేశీ ఆటగాళ్ల రాకపై అందరి దృష్టీ నెలకొంది. భారత్-పాక్ యుద్ధం కారణంగా వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం కాల్పుల విరమణతో పరిస్థితులు మారడంతో ఎలాగైనా విదేశీ క్రీడాకారులను భారత్‌కు రప్పించాలని బీసీసీఐ భావిస్తోంది. అయితే ఇందుకు పలువురు ఆటగాళ్లు అంతగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అంతేకాకుండా తమ ప్లేయర్ల భద్రత ముఖ్యమనే ఆలోచనలో ఆయా దేశాల క్రికెట్ బోర్డులు కూడా ఉన్నాయి. వారిని ఒప్పించే బాధ్యతను ఐపీఎల్ సీవోవో హేమంగ్ అమిన్‌కు బోర్డు అప్పగించింది. తను ఇప్పటికే క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డులతో ఇదే విషయమై చర్చించాడు. 'విదేశీ క్రికెట్ బోర్డులతో నేరుగా మాట్లాడుతున్నాం. ఫ్రాంచైజీలు కూడా తమ ఆటగాళ్లతో టచ్‌లో ఉన్నారు. మెజారిటీ క్రికెటర్లు భారత్‌కు వస్తారనే ఆశిస్తున్నాం' అని బోర్డు అధికారి పేర్కొన్నాడు. మరోవైపు ఆసీస్ ఆటగాళ్లలో స్టొయినిస్, ఇన్‌గ్లిస పంజాబ్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. వారిని ఒప్పించేందుకు కోచ్ పాంటింగ్ ప్రయత్నిస్తున్నాడు. ఢిల్లీ కీలక పేసర్ స్టార్క్ ఇక్కడికి వచ్చేందుకు అయిష్టత వ్యక్తం చేశాడు. కమిన్స్, హెడ్ మాత్రం జట్టులో చేరతారని ఆశిస్తున్నట్టు రైజర్స్ యాజమాన్యం పేర్కొంది.

# మే 17న ఐపీఎల్ తిరిగి ప్రారంభం





భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ క్రికెట్ ప్రేమికులకు శుభవార్త చెప్పింది. ఐపీఎల్ 2025 పునఃప్రారంభ తేదీని ప్రకటించింది. ఐపీఎల్ 2025 మే 17న తిరిగి ప్రారంభమవుతుంది. ఇటీవల భారత్, పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా బీసీసీఐ ఈ లీగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేయడం తెలిసిందే. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ప్రకటన అనంతరం ఉద్రిక్తతలు తగ్గడంతో లీగ్ కంటిన్యూ చేయాలని బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. "భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఐపీఎల్ మ్యాచ్‌ల పునఃప్రారంభాన్ని ప్రకటిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం, భద్రతా సంస్థలతో సంప్రదింపుల తరువాత సీజన్ మిగిలిన మ్యాచ్‌లు కొనసాగించాలని నిర్ణయించింది. మే 17వ తేదీన రీస్టార్ట్ కానుండగా, జూన్ 3, 2025 న జరిగే ఫైనల్‌తో ఐపీఎల్ ముగియనుంది.కేవలం 6 వేదికలలో మొత్తం 17 మ్యాచ్‌లు జరుగుతాయి. బీసీసీఐ సవరించిన ఐపీఎల్ షెడ్యూల్‌లో రెండు డబుల్ హెడర్లు ఉన్నాయి, అవి రెండు ఆదివారాల్లో జరుగుతాయి. ప్లేఆఫ్ మ్యాచ్‌లకు సంబంధించిన వేదిక వివరాలను తరువాత ప్రకటిస్తాం" అని అధికారిక ప్రకటనలో పేర్కొంది. భారతదేశ సాయుధ దళాల ధైర్యసాహసాలకు బీసీసీఐ మరోసారి సెల్యూట్ చేసింది. దేశం కోసం వారు చేసే పోరాటం ప్రజలను ప్రశాంతంగా ఉంచుతుంది. దేశంలో అంతా సజావుగా ఉండటానికి వారి కృషి కారణం. భారత బలగాల చర్యలతోనే బీసీసీఐ మిగిలిన ఐపీఎల్ లీగ్ పూర్తి చేయనుంది. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బోర్డు నడుచుకుంటుందని మరోసారి బోర్డు స్పష్టం చేసింది. ఇప్పటివరకు 2025లో, 3 జట్లు ప్లేఆఫ్ పోటీ రేసు నుంచి నిష్క్రమించాయి. 5 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్ నుంచి తప్పుకున్న మొదటి జట్టుగా మారింది, మాజీ ఛాంపియన్స్ రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు కూడా ప్లే ఆఫ్ రేసు నుంచి తప్పుకున్నాయి. ప్రస్తుత ఛాంపియన్లు కోల్‌కతా నైట్ రైడర్స్ తమ చివరి మ్యాచ్‌లో చెన్నైచేతిలో ఓటమిని చవిచూశారు. దాంతో వారి ప్లే ఆఫ్ అవకాశాలు మరింత క్లిష్టతరం అయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో టాప్ 3 స్థానాల్లో ఉన్నాయి. వరుస విజయాలు సాధిస్తున్న ముంబై కూడా ప్లే ఆఫ్ రేసులో బెర్త్ కోసం చూస్తోంది.

# బబ్లీగా ఉండే క్యారెక్టర్‌లో కనిపిస్తా

## : అదితి శంకర్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ భైరవం విజయ్ కనకమేడల దర్శకత్వంలో శ్రీ సత్యసాయి ఆర్ట్ బ్యానర్ పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ అధినేత డా. జయంతిలాల్ గడా సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్స్ గా అదితి శంకర్, ఆనంది, దివ్యా పిళ్ళై నటిస్తున్నారు. భైరవం మే 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అదితి శంకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ఈ సినిమాలో బబ్లీగా ఉండే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. ఇది నా ఒరిజినల్ క్యారెక్టర్‌కి దగ్గరగానే ఉంటుంది. ఈ మల్టీస్టార్ సినిమాలో నటించడం మరచిపోలేని అనుభూతినిచ్చింది. హీరోలు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్‌లు తమిళ్ మాట్లాడతారు. దీంతో ఈ సినిమాలో నటించడం సులభంగా అనిపించింది. ముగ్గురు హీరోలు అద్భుతంగా నటించారు. శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. నాకు డ్యాన్స్ చాలా ఇష్టం. ఇందులో రెండు డాన్సింగ్ నెంబర్స్ ఉన్నాయి. ఆ రెండు కూడా నాకు ఫేవరెట్. -నిర్మాత రాధమోహన్ ప్రతిరోజు సెట్‌కి వచ్చేవారు. షూటింగ్‌ని చాలా ఎంజాయ్ చేసేవారు. విజయ్ కనకమేడల %-% చాలా మంచి క్లారిటీ ఉన్న డైరెక్టర్. ఆయనకు ఆర్టిస్టుల నుంచి ఎలాంటి నటనను రాబట్టు కోవాలో తెలుసు"అని అన్నారు.



# పవన్ కల్యాణ్ 'ఓజీ' షూటింగ్ లో పాల్గొన్న శ్రియా రెడ్డి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్). ఇందులో పవన్ సరసన ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తోంది. సుదీర్ఘ విరామం తర్వాత ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాదులో పునఃప్రారంభమైంది. ప్రముఖ నటి శ్రియా రెడ్డి కూడా 'ఓజీ' షూటింగ్‌లో పాలుపంచుకున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో ఆమె నేడు పాల్గొన్నారు.

సెట్స్‌లోకి తిరిగి రావడం పట్ల శ్రియా రెడ్డి తన సంతోషాన్ని, ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. దర్శకుడు సుజీత్ మరియు చిత్ర బృందంతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. "మరోసారి ఓజీ సెట్స్‌లోకి వచ్చేశాను. సుజీత్ అండ్ గ్యాంగ్.. ఇలా ఉత్తమ బృందంతో పనిచేస్తున్నా. ఇక ఆయనతో (పవన్ కల్యాణ్‌ను ఉద్దేశిస్తూ) పనిచేయడానికి చాలా ఉత్సాహంగా ఉంది. ఇదొక అద్భుతమైన అనుభవం. ఇంత డెప్త్ ఉన్న పాత్రను పోషిస్తున్నందుకు నిజంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని శ్రియా రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల 'సలార్' చిత్రంలో రాధా రమ పాత్రలో తన అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు పొందిన శ్రియా రెడ్డి, 'ఓజీ'లో కూడా ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, "హైదరాబాద్ నాకు ఎప్పుడూ రెండో ఇల్లు లాంటిదే. నా ఆత్మీయ స్నేహితుల్లో చాలామంది ఇక్కడి వారే. నేను పెద్దగా ఫుడీని కాకపోయినా, ఇక్కడి కొన్ని రుచులు నాకు ఇష్టం. కొత్తగా ప్రారంభమైన రెస్టారెంట్లలోకి వెళ్ళడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆమె తెలిపారు. 'ఓజీ' చిత్రం స్టైలిష్ యాక్షన్ సన్నివేశాలు, బలమైన భావోద్వేగాలతో కూడిన కథనంతో రూపొందుతుండటంతో ప్రేక్షకులు, అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. పవన్ కల్యాణ్ ప్రధాన పాత్ర పోషిస్తుండటం, భారీ తారాగణం మరియు సుజీత్ విలక్షణమైన మేకింగ్ స్టైల్ ఈ సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. విభిన్నమైన విజువల్స్, ఉత్కంఠభరితమైన కథనాలతో పేరుపొందిన సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఓజీ', ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తోంది. రాబోయే రోజుల్లో 'ఓజీ' ప్రపంచం నుంచి మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లు వెలువడే అవకాశం ఉందని అభిమానులు ఎదురుచూస్తున్నారు.





# కెతిక శర్మ హిట్టు కొట్టిందోచ్..!

అందాల భామ కెతిక శర్మ ఆకాష్ పూరీ చేసిన రొమాంటిక్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అంతకుముందు డబ్ స్మాష్ వీడియోలతో సోషల్ మీడియాలో క్రేజీ ఫాలోయింగ్ ఏర్పరచుకున్న అమ్మడు తెలుగు ఆఫర్ అందుకోగానే సూపర్ అనిపించుకుంది. ఐతే రొమాంటిక్ సినిమాలో కెతిక గ్లామర్ షో మెప్పించినా సినిమా వర్క్ అవుట్ కాలేదు. ఇక ఆ తర్వాత అశ్వద్ధామ చేసినా అది తుస్సుమన్నది. హీరోయిన్ గా చేసిన సినిమాలు ఫ్లాప్ అయితే ఆ కథానాయికలకు అవకాశాలు రావడం కష్టం. కెతిక విషయంలో కూడా అదే జరిగింది. ఈ క్రమంలోనే పవన్ కళ్యాణ్, సాయి ధరం తేజ్ చేసిన బ్రో సినిమాలో కూడా నటించింది కెతిక. అది కూడా అంతగా కెరీర్ కి హెల్ప్ అవ్వలేదు. ఐతే కెరీర్ డైలమాలో పడిన ఈ అమ్మడు శ్రీవిష్ణు సినిమా ఛాన్స్ అందుకుంది. సింగిల్ అంటూ వచ్చిన సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. రొమాంటిక్ సినిమాతో కెరీర్ మొదలు పెట్టిన కెతిక శర్మ తెరంగేట్రం చేసిన 4 ఏళ్ల తర్వాత హిట్ అందుకుంది. సింగిల్ సినిమాలో కెతిక లుక్స్ కూడా చాలా బాగున్నాయి. అమ్మడు కాస్త స్లిమ్ గా మారినట్టుగా ఉంది. అవకాశాల కోసం తమని తాము మార్చుకునే హీరోయిన్స్ కి కచ్చితంగా టాలీవుడ్ లో మంచి ఎంకరేజ్ మెంట్ ఉంటుంది. రొమాంటిక్ సినిమాతోనే తెలుగు ఆడియన్స్ లో హాలిలిట్ ఇమేజ్ తెచ్చుకున్న కెతిక ఫైనల్ గా సింగిల్ తో సక్సెస్ రుచి చూసింది. ఈ సింగిల్ ఇచ్చిన హిట్ జోష్ తో కెతిక ఇక మీదట ఇదే సక్సెస్ ఫాం కొనసాగిస్తుందేమో చూడాలి. సినిమా కథల విషయంలో హీరోయిన్స్ అందరు చేసే తప్పులనే చేస్తూ వచ్చింది కెతిక శర్మ. కేవలం రెండు డైలాగ్స్, 3 పాటల్లో కనిపించే సినిమాలు చేసినా లెక్క పెట్టుకోవడానికి తప్ప కెరీర్ కు ఎలాంటి ఉపయోగం ఉండదు. ఐతే ఇప్పుడిప్పుడే రియాలిటీని అర్థం చేసుకుంటున్న కెతిక ఇక మీదట కథల విషయంలో జాగ్రత్త పడే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. సింగిల్ హిట్ జోష్ లో ఉన్న కెతిక ఇదే ఊపులో మరో సినిమా అవకాశం అందుకుని అది కూడా సక్సెస్ కొడితే మాత్రం ఇక అమ్మడికి టాలీవుడ్ కెరీర్ కి ఇబ్బంది ఉండదని ఫిక్స్ అవ్వొచ్చు.



# పాక్ నటికి షాకిచ్చిన బాలీవుడ్

పహల్గామ్ ఉగ్రదాడి వల్ల దేశంలో ఎన్నో మార్పులొచ్చాయి. ప్రతీ విషయంలో ఆ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే సినీ ఇండస్ట్రీలో మన దేశానికి చెందిన వాళ్లే కాకుండా ఇతర దేశాలకు సంబంధించిన వాళ్లు కూడా వర్క్ చేస్తుంటారనే విషయం తెలిసిందే. అందులో భాగంగానే పాక్ నటీనటులు కూడా ఇండియన్ సినిమాలో కొంతమంది నటిస్తున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి, దాన్ని తిప్పి కొడుతూ ఇండియన్ ప్రభుత్వం చేసిన ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పలువురు పాక్ ఆర్టిస్టులపై ఇండియన్ సినీ ఆర్టిస్ట్ అసోసియేషన్ నిషేధం విధించింది. ఇప్పుడు తాజాగా బాలీవుడ్ మూవీ సనమ్ తేరీ కసమ్2 నుంచి పాకిస్తాన్ నటి మావ్రా హొకెన్ ను తప్పిస్తున్నట్టు చిత్ర యూనిట్ అనౌన్స్ చేసింది. పాకిస్తాన్ తో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశమే ప్రధానమని చెప్తూ ఆమెను తొలగిస్తూ చిత్ర యూనిట్ ప్రకటించింది. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనైనా నిస్సందేహంగా ఖండిస్తామని కూడా చిత్ర మేకర్స్ ఈ సందర్భంగా తెలిపారు. ఇదిలా ఉంటే ఆ సినిమాలో హీరోగా నటించిన హర్షవర్ధన్ రాణే గతంలోనే ఆమె ఉంటే నటించేది లేదని స్టేట్‌మెంట్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ పై మావ్రా చేసిన వ్యాఖ్యలపై స్పందించిన హర్షవర్ధన్ తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టాడు. ఆ పోస్ట్ లో తన దేశాన్ని ఉద్దేశించి కొందరు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తానొక నిర్ణయానికి వచ్చానని, గతంలో నటించిన వాళ్లే సనమ్ తేరీ కసమ్2 లో కూడా నటిస్తానంటే తాను అందులో నటించాలనుకోవడం లేదని రాసుకొచ్చాడు.

# చిక్కుల్లో 'డ్యూడ్'.. మైత్రీకి కొత్త తలనొప్పి!

కొద్ది రోజుల క్రితం ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రదీప్ రంగనాథ్ తో ఓ సినిమాని అనౌన్స్ చేసింది. తాజాగా ఈ సినిమాకు 'డ్యూడ్' అనే టైటిల్ ను కన్ఫార్మ్ చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. దీపావళి కానుకగా మూవీని రిలీజ్ చేస్తామని కూడా తెలిపారు. రొమాంటిక్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రానికి కీర్తిశ్వరన్ డైరెక్టర్ కాగా.. 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు హీరోయిన్ గా ఎంపిక అయింది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు. అంతా బాగానే జరుగుతున్న సమయంలో డ్యూడ్ టైటిల్ చిక్కుల్లో పడింది. దాంతో మైత్రీకి కొత్త తలనొప్పి మొదలైంది. మైత్రి మూవీ మేకర్స్ వారు టైటిల్ ప్రకటన చేసిన వెంటనే.. డ్యూడ్ టైటిల్ తమదంటూ యువ హీరో-డైరెక్టర్-ప్రొడ్యూసర్ తేజ్ తెరపైకి వచ్చాడు. ఏడాది క్రితమే 'డ్యూడ్' టైటిల్ ను తమ సినిమా కోసం రిజిస్టర్ చేశామని.. అదే టైటిల్ తో సినిమాను ప్రచారం కూడా చేస్తున్నామని తేజ్ తెలిపాడు. ఇప్పుడు ఆ పేరునే మైత్రి వారు అనౌన్స్ చేయడం ఆశ్చర్యంగా, ఆవేదనగా ఉందన్నాడు తేజ్. అయితే మైత్రి వంటి బడా నిర్మాణ సంస్థతో ఘర్షన పడే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని.. ఆల్రెడీ ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లానని, సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని తేజ్ పేర్కొన్నాడు. తేజ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రమే 'డ్యూడ్'. స్క్రీన్ ప్లే కూడా అతనే అందిస్తున్నాడు. ఫూట్ బాల్ నేపథ్య కథతో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. రంగాయన రఘు ఇందులో ఫుట్ బాల్ కోచ్ గా కనిపించబోతున్నారు. రాఘవేంద్ర రాజ్ కుమార్, శాన్య కావేరమ్మ, మేఘ, మోహిత, అనర్ఘ్య, దీపాలి పాండే తదితరులు ఇతర ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించి కొన్ని పోస్టర్స్ బయటకు వచ్చాయి. చిత్రీకరణ దాదాపు ఆఖరి దశకు చేరుకుంది. లాస్ట్ షెడ్యూల్ ఒక్కటే బ్యాలెన్స్. ఆగస్టు లేదా సెప్టెంబర్ లో ఈ చిత్రాన్ని తెలుగులోనే కాకుండా కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయాలని డ్యూడ్ మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఇంతలోనే ప్రదీప్ రంగనాథ్ తో తీయబోయే చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ వారు డ్యూడ్ టైటిల్ కన్ఫార్మ్ చేస్తూ పోస్టర్ ను రిలీజ్ చేశారు. దాంతో ఒరిజినల్ డ్యూడ్ వారు ఉలిక్కి పడ్డారు. టైటిల్ తమదంటూ ముందుకు వచ్చారు. మరి ఈ ఇష్యూపై మైత్రీ వారు ఎలా రియాక్ట్ అవుతారో.. ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో.. చూడాలి.






# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రీకరణ పూర్తి

%హీరో నాగశౌర్య అప్ కమింగ్ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్ బాయ్ కార్తీక్. ఈ మూవీకి రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వైష్ణవి ఫిలిమ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. నాగ శౌర్య క్యారెక్టర్ ఇంటెన్స్ నేచర్‌ని చూపించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ కి చాలా మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్ ని ప్రకటిస్తారు. ఈ చిత్రంలో నాగశౌర్య జోడిగా విధి హీరోయిన్ గా నటిస్తోంది. సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.